ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

సెప్టెంబర్ 09, 2018

స్నేహ



అన్నా పియెర్ దిమిత్రి హాజీల

మనోకవి

విదేశాల్లో మన చిత్రాలు



భారతీయ చిత్రాలకు విదేశీమార్కెట్‌గా నిన్నమొన్నటి దాకా చైనా, అమెరికా లాంటి దేశాల పేర్లు మాత్రమే వినిపించేవి. ఈ ట్రెండ్‌లో ఇప్పుడో కొత్త మార్పు చోటుచేసుకుంటోంది. భారతీయ చిత్రాల విడుదలతోపాటు వాటి భారీ వసూళ్ళకూ ఇప్పుడు రష్యా, కజకిస్తాన్, పోలెండ్ లాంటి దేశాలు వేదికలవుతున్నాయి. ఈ నెలలో యష్‌రాజ్ ఫిల్మ్స్ ద్వారా విడుదలైన 'హిచ్కీ' చిత్రానికి రష్యా, కజకిస్తాన్‌లోనూ మంచి మార్కెట్ లభించింది. ఇక తమిళ్‌లో విడుదలకు సిద్ధమౌతున్న యాక్షన్ కామెడీ చిత్రం 'సీమ రాజ'ను పోలెండ్‌లో సెవెన్త్ సెన్స్ సినిమ్యాటిక్స్ సంస్థ విడుదల చేయనుండంటే భారతీయ చిత్రాలకు అక్కడ లభిస్తున్న ఆదరణ ఎలాంటిదో అర్థంచేసుకోవచ్చు. ఇక ఎరోస్ ఇంటర్నేషనల్ నిర్మించిన 'భజీరంగీ భాయిజాన్' టర్కీలో ఓ బ్లాక్‌బస్టర్ చిత్రంగా నిలిస్తే గతేడాది వచ్చిన 'మున్నా మైకేల్', 'శుభ్ మంగళ్ సావధాన్' రెండు చిత్రాలూ భారత్‌తోపాటు పోలెండ్‌లోనూ భారీ వసూళ్ళనిచ్చాయి. ఇక మన తెలుగు చిత్రం బాహుబలి సైతం భారత్‌తోపాటు వివిధ విదేశీ మార్కెట్‌లో ఓ సంచలన విజయం సాధించింది. ఆ తర్వాత వచ్చిన 'భరత్ అనే నేను', 'రంగస్థలం' సైతం అమెరికా, ఆస్ట్రేలియా దేశాల్లో భారీవసూళ్ళనే చేశాయి. ఇలా భారతీయ చిత్రాలు విదేశాల్లో విడుదలవడం, విజయం సాధించడం అంతా మామూలే అయినా, భారతీయులు ఎక్కువగాలేని దేశాల్లోనూ మన చిత్రాలు ఇంతలా ప్రాచుర్యం పొందడమే ఇప్పుడు అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. హాలీవుడ్ చిత్రాల్లా స్పెషల్ ఎఫెక్ట్స్, యాక్షన్ డ్రామా మేళవింపులు కాదుగానీ, మన చిత్రాలు ఇంతగా విదేశీయుల్ని ఆకట్టుకోడానికి ఓ మంచి కారణమే ఉందట. ఇంతకీ అసలు విషయం ఏంటంటే.. భారతీయ స్థానికతను అద్దంపట్టే కుటుంబ నేపథ్యాలు, భావోద్వేగాలతోపాటు పాటలు, డ్యాన్స్‌లు కూడా వివిధ దేశాల వారిని కట్టిపడేస్తున్నాయట. ఇక చైనా, పోలెండ్, కొరియా తర్వాత టర్కీ, కజకిస్తాన్ వాసులూ భారతీయ చిత్రాల్ని ఇష్టపడుతున్నారట. దీనికి తోడు నెట్‌ఫ్లిక్స్, రెడ్ చిల్లీస్ లాంటి మాధ్యమాల్లో తెలుగు చిత్రాల్ని అందుబాటులోకి తేవడం కూడా భారతీయ చిత్రాల మార్కెట్ విస్తరణకు దోహదపడుతోందనేది సినీ ప్రముఖుల అభిప్రాయం.











అన్నా, పెయిర్, దిమిత్రి, పాజిల మనోకవి
అట్టమీది కథ..... 6

తేలియాడే తోటలు
ప్రత్యేకం..... 12

సేవ - 4
మహా సంకల్పం

సన్నివేశమ్ - 2
బూర

తెలుసా -11
ప్రథమ చికిత్స

వింతలోకం -17
కయ్యూరు రాళ్లు

ప్రత్యేకం - 5
మరో స్క్వాష్ స్టార్

కథ -14
శ్రమ దోపిడీ

బాలనేస్తాలు - 18
సాక్ష్యం

సుచిత్రం -24
గిలగిలలాడే ప్రాణం


కన్నీళ్లెందుకు
ఉప్పగుంటాయ్ తియ్యగుంటే
కడదాకా వదలవు గనుక
కష్టాలెందుకు బరువుగుంటాయ్ తేలికైతే
బ్రతుకంతా మోస్తూ దించవ్ గనుక
ఎదురే లేని నీకు కాక, ఎవరికెదురు పడుతుంది
నిప్పుల నడక
చూద్దాం అంటూ నీ తడాఖా, వచ్చింది ఇబ్బంది
నువ్వున్న ఇంటి గడపదాక
పడ్డవాడే.. కష్టపడ్డవాడే.. పైకి లేచే ప్రతోడు
ఒక్కడైనా కానరాడే జీవితాన్ని పోరాడకుండా
గెలిచినోడు
ఛల్ ఛలో ఛలో లైఫ్ సే మిలో,
ఇదో కొత్త చాప్టర్ జస్ట్ సే హలో
ఛల్ ఛలో ఛలో చలించు దారిలో,
ప్రతీ ఒక్క ఛాలెంజ్ ఫేస్ చెయ్యరో
రచన : రామజోగయ్య శాస్త్రి
గీతం : ఛల్ ఛలో ఛలో...
చిత్రం: S/O సత్యమూర్తి



02 సెప్టెంబర్ స్నేహలో 'అట్టమీది కథ'గా వచ్చిన 'వెల్లువెత్తిన మానవత్వం' వ్యాసం చాలా బాగుంది. 'ఉరితీయండి' స్టోరీ ద్వారా ఈ కాలంలో జరుగుతున్న ఘోరాల గురించి తెలియజేసినందుకు రచయితకు ధన్యవాదాలు. చివరి అట్టలో వచ్చిన నల్లని ఇసుక 'బీచ్' దృశ్యాలు చూసి ఆశ్చర్య పోయాం. 'కొబ్బరి ప్యాలెస్' గురించి తెలుసుకున్నాం.

- సరిత,
విజయవాడ

సెల్‌ఫోన్ల ద్వారా అబద్ధపు కథనాలు వెళ్ళిపోతున్న నేపథ్యంలో కలెక్టర్ అలీ అద్భుత ఆలోచన బాగుంది. 'ఆపాత చిత్రం' ద్వారా ఎన్నో పాత చిత్రాలపై విశ్లేషించిన శీర్షిక ఈ వారంతో ముగింపు పలకడం బాధగానే ఉంది. మేమెంతా ఆదివారాన ముందుగా చదివే 'ఆపాత చిత్రం' వంటి మరో కొత్త శీర్షికతో మా ముందుకు రావాలని ఆశిస్తున్నాం.

- జగన్‌మోహన్,
సోమల

02 సెప్టెంబర్ నాటి స్నేహ సంచికలో 'అట్టమీది కథ'గా 'వెల్లువెత్తిన మానవత్వం' రచయిత అందించిన వ్యాస రచన వర్తమాన కేరళ చిత్రాన్ని కళ్ల ముందుంచింది. ఇంకా మానవత్వం మిగిలే ఉందనీ, అన్ని వైపుల నుంచి వస్తున్న సహాయ, సహకారాలే నిరూపిస్తున్నాయి. 'ఉరితీయండి' రచయితకు అభినందనలు. కవితలన్నీ అభ్యుదయ పరంపరలను అక్షరబద్ధం చేసి, ఆలోచింపజేశాయి. లెగో చిత్రాలు అద్భుతంగా ఉన్నాయి. 'గొరిల్లా ట్రాకర్లు' కూడా ఉంటారని ప్రప్రథమంగా తెలుసుకున్నాం.

- నేమాన సుభాష్ చంద్రబోస్
విశాఖపట్నం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా : స్నేహ,
ప్రజాశక్తి, డోర్ నెం : 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

బూర

- అజై
95023 95077

ఎత్తుపల్లాల దారి మార్కెట్ అది. ఓ రెండు అడుగులు ఎత్తుకు చేరగానే తలలన్నీ కప్పేసిన దారితీరు కనిపిస్తుంది. ఆ కుర్రాడి మెడ చుట్టూ కాళ్లేసి జుత్తుని గట్టిగా పట్టుకుని భుజాల మీద కూర్చున్న కూతురు... దారి పల్లంలోనూ ఆ తలల సమతలాన్ని ఆశ్చర్యపోతూ చూస్తోంది. ఒకదానికొకటి తగలకుండా పక్కలకు, ముందుకు వెనక్కు కదులుతున్న వాటి నడతలో ఏదో కార్టూన్ షో ఆ చిన్నారికి కనిపిస్తోంది. ఎవరో నేలకు దారం కట్టి గాల్లో వేలాడేసిన నల్లటిబూరల్లా ఆ తలలన్నీ కదులుతున్నాయి. అందుకే చిన్నారెప్పుడూ తండ్రి జుత్తు పగ్గాల్ని పట్టుకుని సవారీ చేస్తుంటుంది. ఓ రెండడుగుల ఎత్తున కూర్చుని మార్కెట్‌ను గమనిస్తుంటుంది. అన్ని తలలూ నల్లటి బూరలు కాదు..! కొన్ని బతుకు భారాన్ని నెత్తిన బుట్టపెట్టి అమ్ముతున్నాయి. కొన్ని చున్నీలు, టోపీలు, కళ్లద్దాలు ధరించి ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. మధ్యమధ్యలో కొన్ని యవ్వనతలలు ఎగిరెగిరిపడుతున్నాయి. వీటన్నింటి మధ్యా ఓ పసుపుపచ్చని నిజమైన బూర ఒకటి గాల్లోకి లేచింది. హీలియం నింపారేమో ఆ ఇరుకు దారిలో నాలుగైదు అంతస్తులున్న కట్టడాల్ని దాటి మబ్బుల్ని ముద్దాలాడాలని మెత్తగా పైకెగసే ప్రయత్నం చేస్తోంది. దారి మధ్యన చిందరవందరగా అల్లుకున్న కేబుల్, కరెంట్ వైర్లు దాన్ని చిక్కుల్లో పెట్టేందుకు సాలీడు గూడులా ఎదురుచూస్తున్నాయి. బహుశా ఆ బెలూన్‌ను ఎవరైనా బుజ్జాయి పట్టుకుని ఉండడు. అదే అయితే, ఎప్పుడో విడిచిపెట్టేసేవాడు. వాడికి అదెలా ఆకాశం లోలోకి చేరుతుందనే క్యూరియాసిటీ ఉంటుంది కదా..! తీగెల చిక్కుల్లో తెగిపోకుండా, పగిలిపోకుండా జాగ్రత్తగా అంతమంది జనాల మధ్య నేర్పుగా దారి మళ్లిస్తూ ఇటుగా తెస్తున్నారు. అంటే, ఎవరో పెద్దవాళ్లే ఆ పసుపుపచ్చటి బూరను లాక్కొస్తున్నారన్నమాట..!

••

అంత జనసమ్మర్దంలో నెత్తిన పెట్టుకున్న బరువులు, బాధ్యతలు, బతుకుల్ని దాటి అది పైపైన కదులుతోంది. ఏదో కాంట్రాస్ట్ కుదిరినట్టు అన్ని నల్లతలల మధ్య కొట్టొచ్చినట్టు దూరం నుంచి కనిపిస్తోంది. ఇంకేం... కుర్రాడి కూతురి కంటబడింది. అది ఓ అరమైలు దూరంలో ఉండగానే ఆ చిన్నారి మనస్సు చటుక్కున ఆ బెలూన్‌లో దూరిపోయింది. 'హో.. బెలూన్ నాన్నా..!' అని గట్టిగా అరిచి టపీటపీమని పాదాల్ని తండ్రి ఛాతీలపై ఆడించింది. పక్క సందుకు తిరగబోతున్న తండ్రి తలను గట్టిగా జుట్టులాగి బెలూన్ డైరెక్షన్‌లోకి టర్న్ చేసింది.. అచ్చు బైక్ హ్యాండిల్, కార్ స్టీరింగ్... ఇవన్నీ కాదుగానీ.. కాక్‌పిట్‌లో కూర్చున్న బుల్లి పైలెట్‌లా. మాడు మంటపుడితే ముఖాన్నంతా దగ్గర చేసుకుని నొప్పిని భరిస్తూ నాన్న ఇమానం బూర వైపు ఎదురెళ్లింది. తండ్రి దాని వైపే ముందుకే వెళుతున్న గాలికి కదులుతున్న బూరలా తండ్రి బుర్రను తిప్పేస్తోంది చిన్నారి. కూతురి ఆరాటాన్ని అర్థంచేసుకున్న కుర్రాడు.. ఎలాగూ ఆ బూరను తీసుకునే అవకాశం ఉండదు కనుక, ఓ బూరల ప్యాకెట్ కొని తన బిడ్డ మనస్సు గాల్లో తేలిపోయేలా చేయాలని ఎక్జైట్ అయ్యాడు. ఆ బూర ఇంకొంత దూరంలోనే పక్క సందుకు మరలిపోయేసరికి చిన్నారి కుర్రాడి బుగ్గల్ని చేతుల్తో కొడుతూ ఆదుర్దాపడింది. అది చేయిదాటిపోతోందని ఆందోళన ఆ చిన్నారి పాదాలు బిగుసుకున్న తీరులో తండ్రికి తెలిసింది. బలవంతంగా తల పైకెత్తి చూశాడు ఆ బూర ఎటువైపు తిరిగిందో..! చిన్నారి చేతుల్ని గట్టిగా పట్టుకుని పరుగున అటువైపు కదిలాడు. తీరా దగ్గరకు వెళ్లేసరికి ఆ బూర పట్టుకున్నది ఓ ప్రేమజంట. చేతిలోచేయేసుకుని మెడను ప్రియుడి మీద వాల్చి మధ్యమధ్యలో ఓసారి బెలూన్‌ను జాగ్రత్తగా చూసుకుంటున్న ఆ అమ్మాయిని చూసి అంతదూరంలోనే కుర్రాడు ఆగిపోయాడు. వాళ్లను అడిగితీసుకుంటే బాగుంటుందా..! అనే ఏదో అపరాధభావం మెదిలి మెల్లిగా కూతుర్ని కిందకు దించాడు. ఆ బెలూన్ కోసమే తల్లడిల్లుతూ రెప్పలేస్తున్న కూతురి చూపుల్ని చూసి ముఖం నేలకేశాడు.

••

అసలా గ్యాస్ బెలూన్లు ఎక్కడ కొనుక్కుని ఉంటారనే ఆలోచనతో పక్కనే ఉన్న ఓ అరుగు ఎక్కి రోడ్డంతా చూపులతో గాలించాడు. అది తప్ప మరెక్కడా బెలూన్ పైకి లేచింది లేదు. బహుశా దగ్గరలోని ఏదైనా పార్కు వద్ద కొనుక్కుని ఉంటారులే... అని జవాబు చేసుకుని కూతుర్ని ఎత్తుకున్నాడు. 'అయినా.. నీకు పసుపు రంగు అంటే ఇష్టం లేదు కద నాన్నా..! వేరే కలర్స్ బెలూన్లు బోలెడు కొనుక్కుందాం' అంటూ ఊరడించే ప్రయత్నం చేశాడు. అంతకుముందే.. హ్యాపీ బర్త్‌డేకి హాలంతా రంగురంగుల బూరలు ఎగిరిగంతేసిన గుర్తు ఉంది. 'అయ్..' అంటూ చిన్నారి తండ్రి బుగ్గను లాగి ముద్దాడింది. కుర్రాడు ఏదో అలిగితే... తల్లె ఊరడిస్తున్నట్టే తండ్రి తలను హృదయానికి లాక్కుంది. పిల్లలు ఓ పట్టాన కుదురుగా ఉండరూ.. అర్థమూ కారు. ఆప్యాయత కలిపిన ఓ మాటకే కుదుటపడే ఆ పసిమనసు కోరికలెప్పుడూ గాలిబూరంత తేలిగ్గానే ఉంటాయి. కూతురు సర్దుబాటైందని...దగ్గరలో ఫ్యాన్సీ షాప్ ఏదైనా ఉందా అని వెదుకుతూ కుర్రాడు నడుస్తున్నాడు. ఓ రెండు సందులు దాటాక.. చిన్నారి ముఖం చిన్నబోయింది. ఇప్పుడు బెలూన్ల ప్యాకెట్ త్వరగా దొరక్కపోతే..! మళ్లీ మధ్యలో ఆ ప్రేమజంట ఎదురొచ్చి పసుపుపచ్చని బెలూన్ చూపుల్లో కదలాడితే..! కుర్రాడికి ఆదుర్దా పెరిగింది. ఓ మిఠాయిబండి దగ్గర చిరునామా ఆరా తీసి.. పక్కసందుకు మరిలాడు.

..

ఏదో షాపు ఓపెనింగ్ అనుకుంటా...! ముస్తాబు చేస్తున్నారు. అద్దాల్లోంచి లోపలి సందడి కనిపిస్తోంది. ద్వారం వద్దా, హాల్లోను బెలూన్లతో అలంకరించారు. వాటిల్లో ఒకటి తెంపుకొచ్చి చిన్నారికివ్వాలనిపించింది కుర్రాడికి. కానీ, ఏమంటారో..?.. మ్.. విండోషాపింగ్ చేసి అడిగితీసుకుంటే... అని అటుగా అడుగువేయబోయాడు. తన పుట్టినరోజు నాటి కన్నా ఎక్కువ బెలూన్లను అక్కడ చూసిన చిన్నారి మనస్సు గల్లంతైంది. తానే చకచకా తండ్రి చంకను దిగి అటు పరుగిడబోయింది. కుర్రాడి చేతిని విదుల్చుకుని ఓ వెర్రికేకలు పెడుతూ రెండడుగులు వేసింది. సెక్యూర్టీ గార్డు 'సార్... సార్...' అంటూ అడ్డుపడ్డాడు. షాప్ ఓపెనింగ్ ఇవ్వాళ కాదట. రేపు రావాలట..! బలవంతంగా బిడ్డను ఎత్తుకుని కుర్రాడు పక్కకు తీసుకుపోయాడు. ఆ చిన్నారి బలంగా కాళ్లు, చేతులూ ఊపుతూ కిందకు దిగే ప్రయత్నం చేస్తూ గోలపెడుతోంది. కుర్రాడు నవ్వుతూనే.. చిన్నారిని కొంతదూరం తీసుకెళ్లి నిల్చోబెట్టి ఆయాసపడ్డాడు. ఆ షాపులోవన్నీ బ్యాడ్ బాయ్ బెలూన్లని, అస్సలు బాలేదని.. వ్యాక్.. వేస్ట్... అంటూ ఎంత

సముదాయించినా చిన్నారి ఊరుకోవడంలేదు. వీళ్ల అవస్త దూరం నుంచి గమనిస్తున్న షాపు సెక్యూరిటీ సార్.. సార్... అంటూ మళ్లీ కుర్రాణ్ని పిలుస్తున్నాడు. రొప్పుతున్న కుర్రాడు నోటితో సమాధానం ఇవ్వలేక.. చేయి పైకి లేపి ఒక్క నిమిషమంటూ పైకిలేపాడు. అదే అదునుగా చిన్నారి తండ్రి నుంచి తప్పించుకుని అటు పరుగుతీసింది. వెనక్కుతిరిగి తనని అందుకునేలోపు సెక్యూరిటీ ఓ బెలూన్ పట్టుకుని ఎదురొస్తున్నాడు. మధ్యలోనే పాపను పట్టుకుని బూరని చేతికిచ్చి తలనిమిరాడు. హమ్మయ్య.. అనుకున్న కుర్రాడు సెక్యూరిటీకి థ్యాంక్స్ చెప్పి కూతురి చేయిపట్టుకుని నడిపించాడు.

● ●

ఓ స్ట్రాకు కట్టి ఉన్న ఆ బెలూన్ గాల్లో తేలడంలేదు. రబ్బర్ కట్టిన బూరలానైనా కదలడం లేదు. బూర అలా ఆ స్ట్రాకు అతుక్కుపోవడం చిన్నారికి నచ్చలేదు. 'నాన్నా..! ఇది నిద్రపోతోందా..!' అంటూ కుర్రాడిని చిన్నారి ఆరా తీసేసరికి షాక్ తిన్నాడు. పిల్లల ఊహలు, ఊసులు ఒక్కోసారి పెద్దలకు అందవు. కూతురి దూదిపింజలాంటి మనస్సుకు పొంగిపోయి కుర్రాడు మళ్లీ మెడల మీదకు ఎక్కించుకున్నాడు. ఆరు అడుగుల దగ్గరలో తండ్రి.. మరో రెండడుగుల ఎత్తుకు కూతురు.. మరో అడుగు పైకి బెలూన్.. నిదానంగా జనసమ్మర్దంల్లోంచి పక్కనున్న ఖాళీ సందులోకి కదిలాయి... గాలి పోసుకుందామని. పిల్లగాలి తండ్రి వదులు చొక్కాను, కూతురి ముందరిజుట్టును ఊపుతున్నా... బూర మాత్రం కదలకుండా నిర్జీవంగా స్ట్రాకు అతుక్కుని ఉంది. అది నచ్చకే... కూతురి స్ట్రాను విరిచేసి బెలూన్‌ను పైకి ఎగరేసింది. అది గాల్లో తేలకుండా బరువుగా నేల మీద పడి పేలిపోయింది. శబ్దానికి వెనక్కు తిరిగి చూసుకున్న కుర్రాడు.. అరెరె.. అనుకుని కూతుర్ని చంకలోకి చేర్చుకున్నాడు. కూతురి కళ్లల్లోని తడిని చూసి ఏమన్నా అంటే.. పెద్ద



ఏడుపందుకుంటుందని బలంగా ఊపిరితీసుకుని వదిలాడు. 'పర్లేదులే నాన్నా.. మరోటి దొరుకుతుందిలే' అంటూ నచ్చజెప్పి మరో సందుకు తిరిగాడు. ఆశ్చర్యం చిన్నారి.. ఆగకుండా చప్పట్లు కొట్టి కుర్రాడిని బలంగా ముద్దాడింది. దగ్గరలోనే రబ్బరు కట్టిన బూరలమ్మే కుటుంబం కనిపించింది.

ఓ కర్రకు వేలాడదీసిన రంగురంగు బూరలు వేగంగా వీస్తున్న పిల్లగాలికి గసగసలాడుతున్నాయి. వాటిలో పోసే సన్నటి ఇసుక బూరలు కదిలినప్పుడల్లా ఆ శబ్దం చేస్తుంది. ఒకటి కాదు రెండు కావాలి.. అంటూ తండ్రి చెవిలో గుసగుసలాడింది చిన్నారి. కుర్రాడు నవ్వుతూ ఆ కుటుంబం దగ్గరకి చేరాడు. ఓ పక్క పెద్దావిడ బూరలు కట్టిన కర్ర పట్టుకుని నిల్చుంటే.. మరో పక్క తన కూతురి కంటే కాస్త పెద్దవాడైన చిన్నారి ఒకడు పంపుతో బూరలకు గాలి కొడుతున్నాడు. వాడూ తన కూతురిలానే రంగులన్నీ ఎగరేస్తున్న బూరల కర్రనే కళ్లింతలు చేస్తూ చూస్తున్నాడు. ఎప్పటినుంచి గాలి పంపు కొడుతున్నాడో.. వాడి బనీను సగం తడిచిపోయింది.. అంత చల్లటి పిల్లగాలి వీస్తున్నా. బక్కచచ్చిపోయిన వాడి దేహం అంతా కప్పుకున్న ఆ చెమటతో తడిచిన బనీనులోంచి వాడి రొమ్ము ఎగబోత స్పష్టంగా కనిపిస్తోంది. బూరలోకి గాలి నిండుకున్నట్టే.. వాడి రొమ్ములోకి బలంగా గాలి నిండి.. తగ్గుతోంది. ఇంతలో పెద్దావిడ ఓ బూరను తెంచి కుర్రాడి కూతురికి అందించింది. అంతకుముందు అలాంటి రబ్బరు కట్టిన బూరతో ఆడుకున్న అనుభవముంది కదా..! చిన్నారి రబ్బరుని బలంగా పట్టుకుని బూరని ముందుకు వెనక్కు తపతపాకొడుతోంది. దాన్నుంచి ఇసుక శబ్దం పెద్దగానే వినిపిస్తోంది. బూరకు గాలికొట్టలేక ఆగి ఎగసోష తీస్తున్నా బూరల పిల్లాడిని చూసి కుర్రాడి గుండె పేలిపోయినట్టైంది.

✦

కిసుక్కు సిత్రం



ఒంటె మారాజు వేంచాశారహో...!

పొగచూరిన సూరీడు

పావెల్ కుయిజ్కీ



నచ్చిన చిత్రం

సేవ

మహా సంకల్పం

ప్లాస్టిక్ వ్యర్థాలు ఇప్పుడు సముద్రాల్ని మహాసముద్రాల్ని సైతం విషమయం చేసేస్తున్నాయి. అసలు ప్రపంచవ్యాప్తంగా మహాసముద్రాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాల పరిమాణం ఎంతో తెలుసా? 32 కోట్ల కేజీలపైనే. ఇక ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో అత్యధిక చెత్తతో పేరుకుపోయిన ఓ ప్రాంతానికి ది గ్రేటర్ పసిఫిక్ గార్బేజ్ ప్యాచ్ అని పేరు. పెద్ద మొత్తంలో చెత్తతో నిండిన ఈ ప్రాంతాన్ని శుభ్రంచేసేందుకు రూపొందించిన కార్యక్రమమే ది ఓషన్ క్లీనప్ సిస్టమ్. ఇంతకీ ఈ ఆలోచన చేసిందెవరో తెలుసా? నెదర్లాండ్స్‌కు చెందిన బోయన్ స్లాట్ (23). 2040 నాటికి ఇక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా ఏరిపారేయడానికి తను చేస్తున్న కృషేంటో మీరూ తెలుసుకోండి.

మహాసముద్రాల్లో పేరుకుపోతున్న చెత్త వల్ల అక్కడి జలచరాలు ఎదుర్కొంటున్న సమస్యలేంటో బోయన్‌కు బాగా తెలుసు. ఆ విషయాల్నే టెడెక్స్ స్పీకర్‌గా తను చాలా సార్లు ప్రసంగించాడు కూడా. అంతేకాదు ఈ సమస్యకు ఒక పరిష్కారాన్ని కూడా కనుగోవాలనే ఆలోచన వచ్చిందతనికి. అప్పటికి తన వయసు 19 ఏళ్ళు. ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేసుకున్న వెంటనే ఓ ప్రాజెక్టును ప్రారంభించాడు. అలా 2013లో ది ఓషన్ క్లీనప్ కరెంట్ అనే ఎన్‌జివో సంస్థ ద్వారా బోయన్ చేసిన ఆలోచన కార్యరూపం దాల్చింది. క్యాలిఫోర్నియా, హవాయి మధ్య పసిఫిక్ మహాసముద్రంలో అత్యధికంగా చెత్తపేరుకుపోయిన ప్రాంతం ది పసిఫిక్ ట్రాష్ వొర్టెక్స్. దీనికే దిగ్రేట్ పసిఫిక్ గార్బేజ్ ప్యాచ్ అని పేరు. ఇక్కడే ఈ ప్రాజెక్టు మొదలయ్యింది. ది గ్రేట్ పసిఫిక్ గార్బేజ్ ప్యాచ్ విస్తీర్ణంలో స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల మొత్తం విస్తీర్ణానికి సమానంగా ఉంటుంది. జాలరులు ఉపయోగించే చేపల వలలు, వివిధ ప్లాస్టిక్ వ్యర్థాలతో మొత్తం ఇక్కడ పేరుకుపోయిన చెత్త 79 వేల టన్నులు. ఇలా ఈ ప్రాంతం ఒక ప్లాస్టిక్ ద్వీపంలా తయారయ్యింది. దీన్ని పట్టించుకోకుంటే ఇక్కడ ఒక్క జలచరం కూడా జీవించలేదనే విషయాన్ని తెలుసుకున్న బోయన్ తన ప్రాజెక్టును తొలిగా ఇక్కడే మొదలు పెట్టాడు. అందులో భాగంగా చెత్తను బైటికి తెచ్చేందుకు మొట్టమొదట యూ ఆకారంలో ఉండే ఒక ప్లాస్టిక్ పట్టీని మూడు మైళ్ళ దూరం వరకూ అమర్చారు. లంగర్ల సాయంతో ఈ పట్టీలను అమర్చినా ఇవి నీటి ప్రవాహానికి ఎలాంటి ప్రతిబంధకంగా ఉండవు. నీటిపై తేలియాడే ఈ ట్యూబ్ అడుగున ప్రతి రెండు కి.మీ వద్ద చెత్తను నిరోధించే జల్లెడ లాంటి పరికరాల్ని అమర్చారు. వీటితో పాటు నీటి ప్రవాహానికి చెత్త కొట్టుకుపోకుండా యూ ఆకారంలో అమర్చిన పట్టివద్దే ప్లాస్టిక్ వ్యర్థాలు తేలియాడేందుకు మధ్య మధ్యలో కొన్ని కంటెయినర్లు అమర్చారు. ఈ కంటెయినర్లు నీటి ప్రవాహ వేగాన్ని నిలువరిస్తుంటాయి. పట్టీల వద్ద నీటిపైభాగంలో పేరుకుపోయే చెత్తను నెలకోసారి పడవల్లో సేకరిస్తుంటారు. ఇలా పోగేసిన చెత్తను మళ్ళీ నేలపై పడేయకుండా దాన్ని రీ సైకిల్ చేసే సంస్థలకు అప్పగిస్తారు. చెత్తను పోగేయడంతోపాటు దాన్ని రీసైకిల్ చేసే బోయన్ ఆలోచన అక్కడ మంచి ఫలితాల్ని ఇస్తోంది. మరో ఐదేళ్ళలో దాదాపు 50 శాతం ప్లాస్టిక్ వ్యర్థాల్ని తొలగించే లక్ష్యంతో పనిచేస్తోంది ది ఓషన్ క్లీనప్ బృందం. ఇక్కడ ఇంత పెద్ద మొత్తంలో చెత్త పేరుకుపోవడాకి మరో కారణం సముద్ర తీరాలను శుభ్రంగా ఉంచకపోడమే. అందుకే ఇప్పుడు ఈ బృందం సభ్యులు వివిధ దేశాల్లోని సముద్రతీర ప్రాంతాల్లో సంచరిస్తూ అక్కడి వారికి అవగాహన కలిగిన్నారు.



- శారద







స్టార్

ఈ ఆసియా గేమ్స్‌లో భారత స్క్వాష్ జట్టు గతంలో కంటే ఉత్తమ ప్రదర్శన చేసింది. మొత్తంగా 5 పతకాలు సాధించింది. ఇందులో రెండు పతకాలు జోష్న ప్రతిభ వల్లే లభించాయి. సింగిల్స్‌లో కాంస్యం సాధించిన జోష్న, టీమ్ విభాగంలో ఇతర క్రీడాకారిణులతో కలిసి రజతాన్ని సొంతం చేసుకుంది. భారత్‌కు స్క్వాష్ నుంచి మరో క్రీడాజ్యోతిగా ప్రతిభచాటుతున్న జోష్న చినప్ప గురించి ఈ వారం స్టార్‌లో.

మరో స్క్వాష్ స్టార్

★ జ్యోష్న చిన్నప్ప 15 సెప్టెంబర్ 1986లో చెన్నైలో జన్మించింది.

★ తన తాత ముత్తాతలు కూడా ఈ క్రీడలో రాణించడంతో స్క్వాష్‌పై ఇష్టాన్ని పెంచుకుంది చిన్నప్ప. అలా ఏడేళ్ళ వయసులో ఈ క్రీడలోకి ప్రవేశించింది.

★ ఎనిమిదేళ్ళ వయసులోనే మద్రాస్ స్క్వాష్ క్లబ్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొనటం ప్రారంభించింది.

★ చదువుతో పాటు స్క్వాష్ కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించేది.

★ రోజుకు ఐదారు గంటలు ప్రాక్టీస్‌కు కేటాయిస్తూ మరిన్ని మెళకువల్ని నేర్చుకునేది.

★ పద్నాలుగేళ్ళ వయసుకే స్క్వాష్ సీనియర్స్ నేషనల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ టైటిల్‌ను దక్కించుకున్న అతి పిన్న క్రీడాకారిణిగా రికార్డుకెక్కింది.

★ 2003లో బ్రిటీష్ స్క్వాష్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సాధించి, ఈ టైటిల్ సాధించిన తొలి భారతీయ స్క్వాష్ క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది.

★ 2004లో జరిగిన జూనియర్ నేషనల్ స్క్వాష్ పోటీల్లో విజేతగా నిలిచింది చిన్నప్ప.

★ 2005లో బెల్జియంలో జరిగిన ప్రపంచ జూనియర్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచింది. అదే సంవత్సరంలో బ్రిటిష్ ఓపెన్ జూనియర్స్ పోటీల్లో విజేతగా నిలిచింది. ఈ విజయం తనకు మంచి పేరు తెచ్చిపెట్టింది.

★ 2006 నుంచి జూనియర్, సీనియర్స్ విభాగాల్లో ఎన్నో పోటీల్లో పాల్గొని పతకాల్ని సొంతంచేసుకుంది.

★ ఈ ఏడాది మహిళల టీమ్ భారత్ ఫైనల్‌కు చేరుకోవడంతో జోష్నదే ప్రధాన పాత్ర. సెమీ ఫైనల్‌లో నికోల్ డేవిడ్‌పై జోష్న సంచలన విజయంతోనే మన జట్టు తుదిపోరుకు అర్హత సాధించగలిగింది. ఎనిమిది సార్లు ప్రపంచ విజేత నికోల్ డేవిడ్‌ను జోష్న కంగుతినిపించింది. దీంతో పటిష్టమైన మలేషియాపై 2-1 స్కోర్‌తో భారత్ ఫైనల్‌కు చేరుకుంది.

★ జోష్నకు ఇలాంటి విజయాలు సాధించడం ఇదే మొదటిసారి కాదు. 17 ఏళ్ల వయస్సులోనే జాతీయ స్క్వాష్ చాంపియన్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకట్టుకుంది.

★ కష్టమైన పరిస్థితులను ఎదుర్కొని విజయాలు సాధించాలనేది జోష్న మనస్తత్వం. ఒకసారి 11 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు ఒక టోర్నీ సందర్భంగా జోష్నకి 'సులువైన డ్రా' కేటాయించాలని ఆమె తండ్రి అంజన్న చిన్నప్ప అక్కడి అధికారులను కోరాడు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోమని తండ్రిని కోరింది చిన్నారి జోష్న. ఈ విషయాన్ని ఆయన ఎప్పుడూ ప్రస్తావిస్తుంటారు. ప్రశాంతత, నియంత్రణ వంటి లక్షణాలతోనే జోష్న ఆటతీరు ఉంటుంది.

★ ప్రభుత్వం నుంచి తనకు ఎలాంటి సహాయం అందకపోయినా భారత్ నుంచి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-10కు చేరుకోవడం అభినందనీయం.





అపరాధభావం చంపేస్తుంటే.. ఆన్నా కెరనీనా గుర్తుకొచ్చి జీవితాన్ని విషాదాంతం చేసుకోవద్దని వేడుకుంటుంది. బతుకు పోరులో యుద్ధం దేనితో చేయాలో అర్థంకాక సతమతమైతే.. హాజీ మురాద్ సాహసంతో గుర్రపుడెక్కల చప్పుడుని భీకరంగా చేస్తూ దండెత్తుకువస్తాడు. దారితప్పిన జీవితాన్ని ఎలా సరిదిద్దుకోవాలో తెలీక సంక్షోభంలో పడిపోతే.. జీవితానికో అర్థామిస్తానంటూ పియెర్ కావలించుకుంటాడు. ఎన్నడో చేసిన నేరానికి శిక్ష వేసుకుంటే సరిపోతుందా..? పరివర్తన పశ్చాత్తాపంతో సాధ్యమవుతుందా..? అని ప్రశ్నలో పడిపోయినప్పుడు అవకాశమున్నంతవరకూ మంచిని చేస్తూ నేరభారం తగ్గించుకునే ఉపాయాన్ని దిమిత్రి నేర్పిస్తాడు. వీరంతా.. మనోకవి లియో టాల్‌స్టాయ్ సజీవ పాత్రలు. ఆ పాత్రల ద్వారానే టాల్‌స్టాయ్ అంతరంగం అర్థమవుతుంది. వాటి నవలా జీవితాలు సాగిన తీరులోనే టాల్‌స్టాయ్ చెప్పాలనుకున్న మానవీయ విలువల అంతరార్థం బోధపడుతుంది.

ఆన్నా పియెర్, దిమిత్రి, హాజీల మనోకవి

- కూనపరాజు కుమార్
9989999599

కారు రోడ్డు పక్క ఆగింది. వారంతా ఫుట్‌పాత్‌పై. ఎడమవైపు చెక్కలతో కట్టిన రైలింగ్ లాంటి గోడ ఉంది. దీనికో చిన్న గేటు. దాన్ని దాటి లోపలకు వెళ్ళారు. "ఇదే టాల్‌స్టాయ్ మాస్కో ఇల్లు" అంది ఎలీనా. ఆ ఇల్లు కిందాపైనా కలిపి రెండంతస్తులు ఉంది. ఓల్గా అని ఓ పెద్దావిడ రష్యన్ గైడ్. ఆమె రష్యన్‌లో చెబుతూ ఉంటే, ఎలీనా ఇంగ్లీషులోనికి అనువాదం చేసి వారికి చెబుతోంది. "అవే చలికాలంలో టాల్‌స్టాయ్ వేసుకొనే ఓవర్‌కోట్లు", "ఇవిగో ఆయన స్వయంగా చేసుకొన్న తోలుబూట్లు.. అది అతిథులను కలుసుకొనే హాలు, అదిగో ఆ మూల గదిలోనే కనిపిస్తున్న టేబుల్ పైనే కూర్చుని ఆయన చివరి కాలంలో 'నవజీవనం' ఇతర కథలు రాశారు" అంది. "ఈ టేబుల్‌ని ముట్టుకోవచ్చా!"... వాళ్లలో ఒకరు. "వద్దు దయచేసి ముట్టుకోకండి. ఇంకా చాలామంది ముందు తరాల వాళ్ళు కూడా ఈ వస్తువులను చూడాలి!" అంది ఓల్గా. వాళ్ళు మరోచోట ఏదో చూస్తూఉండగా... టేబుల్‌ని తాకితే ఒళ్ళు జలదరించింది. ఆ తర్వాత నెమ్మదిగా కిందకి దిగి బయట ఉన్న తోటలోనికి ఆ బృందం వెళ్లింది. టాల్‌స్టాయ్ నడిచిన బాట అది. టాల్‌స్టాయ్, సోఫియా బొమ్మల దగ్గర నిల్చోని ఫొటోలు తీసుకున్నారు. ఏవో రంగుల బొమ్మలు, పుస్తకాలను కొన్నారు. ఆయన గురించి ఆయన కన్న కలల గురించి, ఆయన జీవితం గురించి, కలలు, కథలు, నవలలు, అందులోని పాత్రలూ కళ్లెదుటే తిరిగింది. గడిపింది రెండు గంటలే అయినా, నాలుగు దశాబ్దాల పాటు ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసిన, అద్భుత సోవియట్ సాహిత్యం ముప్పిరిగొంది. అలా కలలో నడుచుకుంటూ బయటకు వెళ్ళిపోయారు. లియో టాల్‌స్టాయ్ అభిమానికి ఆయన ఇంటిని సందర్శిస్తే అంతకన్నా గొప్ప అనుభూతేముంటుంది.! వందల ఏళ్ల సజీవంగా నిలిచిపోయే పాత్రలు పురుడుపోసుకున్న ఆ ఇంట సాహితీపరిమళం జ్ఞాపకాల్లో గాఢంగా హత్తుకుపోతుంది.

అతడు పరిచయమైతే...

సుమారు నలభై అయిదు సంవత్సరాల క్రితం, ఓ రోజు సాయంత్రం.. ఓ పుస్తకాల ఎర్రబస్సు ఊళ్ళో ఆగేది. ఎవరో వార్త ప్రతి ఇంటా చేర్చేవారు. పిల్లలందరూ పరుగెత్తుకుని వెళ్ళి, ఆ బస్సు చుట్టూ చేరేవారు. వారిని ఒక్కొక్కరినే బస్సులోనికి పంపించేవారు. అందులో బోలెడన్ని పుస్తకాలు. ఒక్కో పుస్తకాన్ని ఆశ్చర్యంగా చూసే పిల్లలకు ఎన్నో పుస్తకాల మధ్య.. అక్కడ టాల్‌స్టాయ్ పరిచయమవుతాడు. చిన్నపిల్లల కథలు, మంచి మంచి బొమ్మలు భలేగా ఉండేవి. ఓ తరం వెనక్కు టాల్‌స్టాయ్ అలా పరిచయమయ్యేవాడు. ఇప్పటితరానికి టాల్‌స్టాయ్ నవలల మీద వచ్చిన చిత్రాల ద్వారా తెలుస్తున్నాడు. అతడి మాటల్లోని, రచనలల్లోని పలుకులతో తన సాహిత్యంలోకి లాక్కెళుతున్నాడు. అది మొదలు జీవిత ప్రయాణంలో ఆయన కథలు, నవలలు, చదవడంతో.. ఊహా సామ్రాజ్యాన్ని రష్యన్ సాహిత్యం ఆక్రమించేస్తుంది. ఈ కథలు, నవలల్లోని పాత్రలు మనల్ని ఇప్పటికీ పలకరిస్తూ ఉంటాయి. 'టాల్‌స్టాయ్' అనే పేరు చెవికి మధురంగానే వినపడుతూ ఉంటుంది.

ఇదో సందర్భం

ఇప్పుడో సందర్భం కలిసి వచ్చింది. ఇది టాల్‌స్టాయ్ 190వ జయంతి సంవత్సరం. మరో దశాబ్దంలోనే 200 ఏళ్ల ఆయన సమక్షాన్ని ప్రపంచం చవిచూసినట్టు. ఈ సందర్భంగా ఆయన గురించి స్మరించుకోవడం సమంజసంగా ఉంటుంది. లియో టాల్‌స్టాయ్ 1828 సెప్టెంబర్ 9న రష్యా సామ్రాజ్యంలోని 'యాస్నా పోలియానా' అనే గ్రామంలో జన్మించారు. ఆయన కుటుంబం రాచరిక సంబంధాలు కలిగిన జమీందారీ కుటుంబం. ఆయన పుట్టిన సంవత్సరానికే తల్లిని... ఏడు సంవత్సరాలకు తండ్రిని కూడా కోల్పోయాడు.





పెంపుడుతల్లి వద్ద పెరిగాడు. యవ్వనంలో జులాయిగా తిరిగి, తరువాత కజాన్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలోనూ తరువాత తత్త్వశాస్త్రంలోనూ చేరి చివరికి చదువు పూర్తి చేయకుండానే తిరిగి తన ఎస్టేట్‌కు చేరాడు. అప్పటిలో జరిగిన రష్యా-క్రిమియా యుద్ధ కాలంలో సైన్యంలో చేరి పనిచేశాక, మాస్కోకు చెందిన ఓ డాక్టర్‌గారి కుమార్తె 'సోఫియా'తో వివాహం జరిగింది. వారికి మొత్తం 13 మంది సంతానం. చివరకు 10 మంది మిగిలారు. మొదట తన బాల్యం, కౌమారం, యవ్వనం (చైల్డ్‌హూడ్, బాయ్‌హూడ్, యూత్) గురించి మూడు పుస్తకాలుగా టాల్‌స్టాయ్ రచనచేశాడు. ఆ తర్వాత సవస్థిపోల్ కథలు, కోసక్కులు యుద్ధము, శాంతి (1869), ఆన్నా కెరనీనా (1877) ఇవాన్ ఇలిచ్ మృతి (1886) నవజీవనం (1899) నవలలు రాశారు. వీటితోపాటు అనేక కథలు, నాటికలు, వ్యాసాలు కూడా రాశారు. ఆయన రచనలతో వాస్తవికవాదాన్ని ఆవిష్కరించారు. నవంబర్ 20, 1910లో 82 సంవత్సరాల వయస్సులో ఆయన చనిపోయారు.

మాస్కో నుంచి సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు బుల్లెట్ ట్రైన్‌లో వెళ్ళినప్పుడు, రైల్వేస్టేషనులో 'ఆన్నా' గుర్తుకువస్తుంది. 140 సంవత్సరాల క్రితం టాల్‌స్టాయ్ రాసిన 'ఆన్నా కెరనీనా' నవలలో కథానాయకి ఆన్నా!. ఆమె కథ మాస్కో నుంచి పీటర్స్‌బర్గ్ వెళ్ళే రైలు ప్రయాణంలో ప్రారంభమవుతుంది. అదే రైల్వేస్టేషన్‌లో జీవితం ముగిసిపోతుంది. పాపం పిచ్చి 'ఆన్నా'.. అనిపిస్తుంది. కళ్లెమ్మట నీటిధార తుడుచుకోకుండా ఆమె మనోలోకంలోకి మనం వెర్రిగా దారితెలియక తిరుగుతుంటాం. ఆన్నా పాత్రను అర్థంచేసుకోవడానికి మనోవిశ్లేషణ చేయగలిగే పాఠకమేధ ఒక్కటే సరిపోతుందా?. ఆమెను సరిగ్గా తెలుసుకోవాలంటే... మానవత, సెన్సిటివిటీ ఉన్న పాఠకహృదయమూ కలవాలి. ఆన్నా కెరనీనా చదివాక ప్రతి గుండె, మనస్సు, బుద్ధి.. ఎందుకో అతిమృదువైపోతుంది. ప్రేమ, మోహాలకు ఉన్న తీవ్రత కన్నా దయ, క్షమలకు ఉన్న ఉన్నతేంటో బోధపడుతుంది. పరిపరివిధాల పరుగులు తీసే ఆలోచనలు పుస్తకం చదవడం పూర్తయ్యాక ఒక్కసారిగా కుప్పకూలి.. అపరాధభావంతో గుండె తల్లడిల్లి గడ్డకట్టుకుపోతుంది. ఆన్నా పాత్ర అపరాధభావంతో చేసుకున్న ఘోరం కన్నా ఆ సమయంలో ఆన్నా పక్కన మనం నిలవలేకపోయామనే ఓదార్చునివ్వలేకపోయామనే భావన మనల్ని దహించేస్తుంది. ఆన్నాలానే మనమూ అంతా కోల్పోయామనే బాధలోకి లాక్కెళుతుంది. ఇంత భావోద్వేగాన్ని ఓ నవల కలిగించాలంటే రచన ఎంత అద్భుతంగా సాగాలి..? లియో టాల్‌స్టాయ్ ఇలానే 'యుద్ధము-శాంతి' మనలో కలిగిస్తాడు.

పియెర్ పరివర్తనలోకి...

టాల్‌స్టాయ్ రాసిన ప్రఖ్యాత నవలలో ఒకటి 'యుద్ధము-శాంతి'. ఈ నవల 1805-13 కాలంలో రష్యాపై నెపోలియన్ (ఫ్రెంచ్) దండయాత్ర నేపథ్యంలో సాగిన చారిత్రాత్మక నవల. సుమారు 1500ల పేజీలతో సాగిన ఈ నవలను 1867లో మొదటి సీరియల్‌గా వెలువరించారు. ఈ నవలలో ప్రధానంగా ప్రిన్స్ ఆంద్రే, నటాషాలు పాత్రధారులైన మరో రెండు జంటలు, ప్రేమకథ అంతర్లీనంగా సాగుతుంది. మరో 30 ప్రధాన పాత్రలు వందలు పాత్రలతో సాగుతుంది. ఇన్ని పాత్రలున్నా పియెర్ బెజుఖోవ్ పాత్రలోనే టాల్‌స్టాయ్ అద్భుత మనోవిశ్లేషణ.. మానసిక పరివర్తనల రచనాచేతన మహాద్భుతంగా కనిపిస్తుంది. ఆంద్రే ప్రాణమిత్రుడైన పియెర్ జీవితంలో యుద్ధం తెచ్చిన మార్పులే ప్రధానంగా నవలకు ప్రాణంపోశాయి. విపరీత ప్రవర్తన, భావోద్వేగాల కలబోతగా పరిచయమయ్యే ఈ పాత్రలో వచ్చిన గుణాత్మకమైన మార్పు.. జీవితార్థం కోసం సాగించే అన్వేషణ... నవలని నడిపిస్తుంది. అందుకే, పియెర్ పాత్ర గురించి మెరియమ్-వెబ్‌స్టర్ 'సాహిత్యంలోనే అత్యంత ఆకర్షణీయమైన, సహానుభూతినొందిన పాత్ర'గా గుర్తించింది. వందల పాత్రల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే.. నిలచిపోయే పాత్ర పియెర్‌ది. 7 లక్షల సైన్యంతో నెపోలియన్ రష్యాపై దండెత్తి వచ్చాడు. సుమారు 8 సంవత్సరాలు సాగిన యుద్ధంలో 1812లో మాస్కోను ఆక్రమించిన తరువాత 1813లోనే తిరిగి వెనక్కుపోవాల్సి వచ్చింది. అప్పటికి అతడి సైన్యం 20 వేలకు పడిపోయింది.

డెబ్బై సంవత్సరాలు తెలుగువాళ్ళను కుదిపేసిన రష్యన్ సాహిత్యం ఇప్పుడు తెరమరుగు అవుతుంది. దీనిని మరో తరానికి అందించాలనే ప్రగాఢ కోరికతో ఔత్సాహికులు, ప్రచురణకర్తలూ కలిసి, రష్యన్ తెలుగు సాహిత్య ఉత్సవం ఈ సంవత్సరమంతా జరపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రష్యన్ అనువాద పుస్తకాలన్నీ పునర్ముద్రించి అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నారు. సాహిత్యం అంటే ఇష్టపడే వారికి, సభలు నిర్వహించి ప్రచారం చేసేందుకు సిద్ధమవడం ఆనందదాయకం. ఈ ఉత్సవాన్ని సెప్టెంబర్ 9, 2018 రష్యన్ మహా రచయిత టాల్‌స్టాయ్ 190వ జన్మదినం సందర్భంగా విజయవాడలో జరిగే ప్రథమ సభ ద్వారా ప్రారంభించడం గొప్ప విషయం.

యుద్ధం మిగిల్చిన గాయాలు, పేదరిక చిత్రమైన జీవితాల నేపథ్యమే 'యుద్ధము- శాంతి'. సామాన్యమైన చిన్న చిన్న ప్రజా సమూహాలే చరిత్రను సృష్టిస్తాయి. పెద్ద సామ్రాజ్యాలు, సైన్యాలు, చక్రవర్తుల పటాటోపాలు వాళ్ళ నిర్ణయాలు చరిత్ర చోదక శక్తులు కాలేవు' అని టాల్‌స్టాయ్ నమ్మాడు. ఈ భావాలనే ఈ నవలలో ప్రతిబింబింపచేశాడు.

నవజీవనానికి..

సమాజం నుంచి వెలివేయబడినవారు, దురదృష్టవంతుల జీవితాలపై, ప్రేమను, వెలుగును చూపించిన నవల ఇది. ఈ నవల 1899లో సీరియల్‌గా ప్రచురించబడింది. ఈ నవలలో ప్రధాన పాత్రలు దిమిత్రి నికలయ్‌డోవ్, మస్లొవాలు. మనిషి తాను చేసిన తప్పులకు, నేరాలకు పశ్చాత్తాపపడి హృదయమున్న మానవునిగా ఆవిర్భవించవచ్చు అనే హామీని ఈ నవల ఇస్తుంది. దయ, మానవత్వమే చివరకు నిలుస్తాయని ఈ నవల చెబుతుంది. దిమిత్రి పాత్ర స్వార్థానికి, నిర్దయతో పరిచయమై.. ఆ తర్వాత పశ్చాత్తాపంతో తనను సరిచేసుకునే ప్రయత్నం చేసే తీరులో ఎంతో మనోవిశ్లేషణ చేస్తాడు టాల్‌స్టాయ్. ఎప్పుడో చేసి మరిచిపోయి నిర్లక్ష్యం చేసిన నేరం ఆ పాత్రను తర్వాతి జీవితంలో బలంగా తాకే తీరులోనే నవజీవనానికి బీజం పడుతుంది. మనిషి ఎలా బతుకును మొదలుపెట్టినా ఎలా ముగించాలనే.. జీవిత పాఠాన్ని దిమిత్రి పాత్ర చెబుతుంది. టాల్‌స్టాయ్ కళాత్మక వైభవం, అతని రచనాశైలి ఈ నవలలో విశ్వరూపం దాలుస్తాయి.

మరణం తర్వాత జీవితం

క్రూరత్వానికి, కోమలత్వానికి... భీకరదాడికి, ఆత్మరక్షణకి.... ఇలా అనేక విరుద్ధకోణాల్ని పెనవేసుకున్న పాత్ర హాజీ మురాద్. మరణం తర్వాత జీవితాన్ని మిగుల్చుకున్న గెరిల్లా పోరాటయోధుడు, చారిత్రాత్మక చెచెన్–డాగిస్తాన్ నేత హాజీ మురాద్ కథను తన యుద్ధానుభవాల్ని మిళితం చేసి అటు ఊహాత్మక పాత్రో, యదార్థజీవితమో.. తెలీనంతగా ఓ ప్రత్యేక శైలిలో లియో టాల్‌స్టాయ్ రాశాడు. ఆ పుస్తకం విడుదల చేయాలనే ఆలోచన లేకుండా.. కేవలం తన మృత్యువు, నిస్సత్తువలపై యుద్ధం ప్రకటించి... రచనను ఎలాగైనా ముగించాలనే పోరాటపటిమతో టాల్‌స్టాయ్ ఈ చిన్ని నవలని పూర్తిచేశారు. ఆయన మరణానంతరం ఇది ప్రచురితమైంది. తన జీవిత చరమాంకంలో సల్పినపోరుకు హాజీ స్ఫూర్తిగా తీసుకున్నాడని టాల్‌స్టాయ్ చెప్పాడు. హాజీ మురాద్ సాగిస్తున్న బాహ్య యుద్ధం కన్నా అతడి లోలోపల సాగుతున్న అంతర్యుద్ధమే పాఠకుల్ని ప్రభావితం చేస్తుంది. ఈ పాత్రలో తన మానసిక లక్షణాల్ని కలిపి చేసిన మనోవిశ్లేషణ అద్భుతం.

ప్రేమే జీవితం

ప్రేమే జీవితం.. పక్కవాళ్ళను, మనుషులను, ప్రేమించడం, కరుణ, దయ, క్షమాపణలతో మెలగడమే జీవితం. నేను ఏమైనా జీవితం గురించి అర్థం చేసుకున్నానంటే.. అది కేవలం ప్రేమ వల్లనే! ప్రేమించడం, ప్రేమించబడడమే జీవితం. ఇంతకు మించి ఏమిలేదు.

\- టాల్‌స్టాయ్

మనో చికిత్స

ఏదో కాలక్షేపం కోసం చదివేది, రాసేది సాహిత్యం కాదు. నిజమైన సృజనాత్మక సాహిత్యం, పాఠకుని మానసిక స్థాయిని అభివృద్ధి చేయాలి. అతని మనస్సుకు చికిత్సగా ఉపయోగపడాలి.

\- టాల్‌స్టాయ్



ఆయనవే అత్యుత్తమం

ఐరిష్ రచయిత జేమ్స్ జోయిస్, బ్రిటిష్ రచయిత్రి వర్జీనియా వోల్ఫ్, టాల్‌స్టాయ్ రచనలు మానవ చరిత్రలోనే ఉద్భవించిన ఉత్తమ కళాఖండాలుగా వర్ణించారు. మన జాతిపిత మహాత్మగాంధీకి ఇష్టమైన రచయిత టాల్‌స్టాయ్. వీరిద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన, అమెరికన్ రచయిత విలియం ఫాల్కనర్... టాల్‌స్టాయ్ రాసిన 'అన్నా కెరనీనా' నవలని మానవజాతి ఆవిర్భవించాక వెలువడిన ఉత్తమ సాహిత్య కళాఖండంగా వర్ణించాడు. టైమ్ మేగజీన్ – ఎప్పటికీ నిలిచిపోయే పది సాహిత్య గ్రంథాలలో 'అన్నా కెరనీనా'ను మొదటిస్థానంలోనూ 'యుద్ధము–శాంతి'ని తరువాతి స్థానంలోనూ ఉంచింది.

టాల్‌స్టాయ్ రచనలు.. మానవ హృదయ వేదనను ఆవిష్కరించాయి. అందుకే అవి ప్రపంచ ప్రజల మనస్సులలో చిరస్మరణీయంగా నిలిచిపోయాయి. ఆయన రచనలతోపాటు రష్యన్ మహా రచయితలు దస్తోయిస్కీ, చెకోవ్, పుష్కిన్, నికలాయ్, గోర్కి, మిహాయిల్, కుప్రిన్. మైకోవిస్కీ, ఆస్త్రవిస్కీ.. ఇలా సాహిత్యం, రెండో ప్రపంచయుద్ధం కాలం నాటి రచయితలు, రష్యాలోని ఇతర ప్రాంతాల రచయితలు వీరందరి సాహిత్యాన్ని కొత్తతరానికి అందుబాటులో తీసుకుని వస్తే... అవి తెలుగు ప్రజల్లో అభ్యుదయ భావాల వ్యాప్తికి ఎంతో ఉపయోగపడుతుంది.

మాస్కోలోని క్రెమ్లిన్ పక్కనే పబ్లిక్ లైబ్రరీ ఎదురుగా ఉన్న దోస్తొయిస్కీ విగ్రహం ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలగజేస్తుంది. పీటర్స్‌బర్గ్ కోట జైల్లో, ఆయనను బంధించిన జైలు గదులు చూసి మనస్సు చివుక్కుమంటుంది. 'పేదజనం' అనే నవలలో రష్యాలోని ప్రజల దుస్థితిని వివరించినందుకు, జార్ చక్రవర్తి ఇచ్చిన బహుమానం... ఈ శిక్ష. సాహిత్యకారుల పేరిట సబ్‌వే స్టేషన్లు, కూడలి ప్రాంతాలు, పెద్ద శిలా విగ్రహాలు.. రష్యాలో కనిపిస్తాయి. అవి సాహితీఅభిమానులకు ఎంతో ఆనందం కలుగజేస్తాయి. మాస్కో శ్మశానంలో చెకోవ్, గోగోల్, మైకవిస్కీ సమాధుల వద్ద వారిని స్మరించునేపుడు... రష్యా ప్రయాణం రష్యన్ సాహిత్య వైభవాన్ని తిరిగి గుర్తు చేస్తుంది. గత స్మృతులను ప్రేరేపిస్తుంది. ఏదో చెయ్యమని ముందు తరాలకు ఈ సాహిత్యాన్ని అందించమని కోరినట్లు అనిపిస్తుంది.

అమరం.. సార్వజనీనం

మనిషి మాటలకు, చేతలకు నైతిక బాధ్యత వాడిదే... అని టాల్‌స్టాయ్ విశ్వసించాడు. 'అన్నా కెరనీనా' నవల... దోషం, నింద, మానవ స్వయంకృతాపరాధ విముక్తి అనే సమస్యలను విస్తృతంగా లేవనెత్తేందుకు టాల్‌స్టాయ్‌కి భూమిక మాత్రమే ఈ నవల. మన జీవితంలో గల యావత్ వ్యవస్థను, కఠినంగా, నిర్దాక్షిణ్యంగా విచారణ చేస్తుంది.. అని రష్యన్ ఎ.ఫెత్ రాశారు. గాఢంగా రష్యన్ స్వభావాన్ని ప్రతిబింబించడం, అలాగే సార్వజనీన సత్యాలను కలిగి ఉండటం వల్ల టాల్‌స్టాయ్ నవల అందరి మనస్సు చూరగొంది. 'అన్నా కెరనీనా' కాలం వరకే పాతబడింది. కానీ, ఆయన సృష్టికి వార్ధక్యం లేదు. నవలలో గల ఆత్మీక సౌందర్యం, విశిష్ట లక్షణాలతో, ఇప్పటికీ అందరి మన్ననలనూ పొందుతుంది. "నేను రాసిన దాన్ని ఈ నాటి పిల్లలు ఇరవై ఏళ్ళ తరువాత చదువుతారని, వాళ్ళు ఏడ్చి, బాధపడి, జీవితాన్ని ప్రేమిస్తారని నాకు గనక చెబితే... నేను నా జీవితాంతం సకల శక్తులు దానికే అంకితం చేసేవాణ్ణి" అని టాల్‌స్టాయ్ రాశారు. అలానే రాశారు. అందుకే అన్నా పాత్ర ఆయన్ను మనోకవిగా ప్రపంచానికి తెలిసేలా చేసింది.

(కవర్ టైటిల్ ఇల్లస్ట్రేటర్: గిరిధర్)

★

కనువిప్పు



విజయపురి పట్టణానికి తూర్పువైపు బకాసురయ్య, పడమటివైపు వక్ర శీనయ్య అనే ఇద్దరు పాల వ్యాపారస్తులు ఉండేవారు. వీరిద్దరూ చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పాలను సేకరించి విజయపురి పట్టణంలో చిల్లర వ్యాపారస్తులకు పాలను విక్రయించేవారు. పసిపిల్లలనుంచి ముసలివారి వరకు పాలను పౌష్టికాహారంగా భావిస్తారు. అలా ప్రతి ఇంటి వారు పాలను కొనుగోలు చేయ సాగారు. బకాసురయ్య పాల వ్యాపారంతో బాగా ఎదగడం చూసి వక్రశీనయ్యకు ఆశ్చర్యం వేసింది.

ఒక రోజు వక్ర శీనయ్య బకాసురయ్య దగ్గరకు వెళ్లి "మన మిద్దరం ఇంచుమించు ఒకే సమయంలో పాల వ్యాపారం ప్రారంభించాం. కానీ నీవు అతి తొందరలో పెద్ద ధనవంతుడివయ్యావు.ఆ రహస్యం నాకూ చెబితే నేను ధనవంతుడినవుతాను" అని అడిగాడు.

"వక్ర శీనయ్యా, నేను పాలలో నీళ్ల కలుపుతాను. అందువల్లే అతి తొందరలో ధనవంతుడినయ్యాను."అంటూ అబద్ధం చెప్పాడు బకాసురయ్య.

ఆ మాటలు నమ్మి వక్రశీనయ్య పాలలో నీళ్ల కలిపి అమ్మడం ప్రారంభించాడు.

వక్రశీనయ్య దగ్గర పాలు కొనే వారందరు పాలు నీళ్లలా ఉన్నాయని అతని దగ్గర కొనే చిల్లర వ్యాపారస్తులు గొడవచేసేవారు.అయినా నీళ్ల కలపడం మానుకోలేదు. ఫిర్యాదులు చేసినా న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదన్న నిర్ణయానికి వచ్చిన కొందరు చిల్లర వ్యాపారస్తులు దూరమైనా శ్రమ అనుకోకుండా బకాసురయ్య దగ్గరకు వెళ్లి పాలను కొనేవారు. మరికొంత మంది చిల్లర వ్యాపారస్తులు అంత దూరం వెళ్లలేక ఆ నీళ్ల పాలు కొని అమ్మసాగారు.

విజయపురికి జయదేవుడు రాజుగా పదవి చేపట్టగానే తన రాజ్యంలో న్యాయం నాలుగు పాదాలతో నడిపించాలన్న ఆలోచన కలిగింది. మంత్రి సలహాతో న్యాయశాస్త్రం క్షుణ్ణంగా చదివిన పండితులను పిలిపించి వారికి పరీక్షలు పెట్టించారు.అందులో మొదటిగా నెగ్గిన సుబుద్ధిని న్యాయపరిపాలనాధికారిగా నియమించాడు.

సుబుద్ధి న్యాయ పరిపాలన మీద నమ్మకం కలిగిన చిల్లర వ్యాపారస్తులు ఒక్కటిగా కలసి వక్రశీనయ్య మీద ఫిర్యాదు చేశారు. న్యాయాధికారి ఉత్తరువు ప్రకారం సైనిక భటులు వక్రశీనయ్యను న్యాయాధిపతి ముందు హాజరు పరిచారు.

"వక్ర శీనయ్యా, నీవు పాలల్లో నీళ్ల ఎందుకు కలిపావో నిజం చెప్పావంటే తక్కువ శిక్ష పడేలా చూస్తాను లేదా నీవు కఠిన శిక్ష అనుభవించవలసివస్తుంది" అన్నారు న్యాయాధిపతి సుబుద్ధి.

"అయ్యా, నాతో పాటు వ్యాపారం ప్రారంభించిన బకాసురయ్య పెద్ద ధనవంతుడు కావడం చూసి ఏదో నాకూ ధనవంతుడు కావాలన్న ఆశతో వాడిని కలిసాను. నీళ్లలో పాలు కలిపి వ్యాపారం చేసి ధనవంతుడు అయ్యానంటే నమ్మి నేను నీళ్ల కలిపి వ్యాపారం చేయడం ప్రారంభించాను. సగం మంది వ్యాపారస్తులు నా దగ్గర పాలు కొనడం మానివేసి ఆ బకాసురయ్య దగ్గరకు వెళ్లిపోవడం నాకే ఆశ్చర్యంగా ఉంది. ఈ పాల వ్యాపారంతో అంత పెద్ద ధనవంతుడయ్యాడో నాకే అంతు పట్టడంలేదు. కానీ వాడి దగ్గర పాలు చిక్కగా ఉందని అందరూ అంటుంటే మరి నా దగ్గర పాలల్లో నీళ్ల కలుపుతున్నట్టుగా ఎందుకు అబద్ధం చెప్పాడో ఇప్పటికీ అర్థం కాలేదు. ఈ నీళ్ల పాల వ్యాపారం వల్ల నాకు చాలా నష్టమే కలిగింది ."అంటూ బాధగా చెప్పాడు.

"వక్ర శీనయ్యా చేసిన తప్పును నిజాయితీగా అంగీకరించావు కాబట్టి యాభై వరహాల జరిమానా విధిస్తున్నాను. జరిమానా చెల్లించి నీవు ఇంటికి వెళ్లి ఎప్పటిలా నీ పాల వ్యాపారం చేసుకోవచ్చు" అన్నారు సుబుద్ధి. తనకు ఎటువంటి శిక్ష విధిస్తారో అన్న భయంతో వున్న బకాసురయ్య ఆ తీర్పు వినగానే సంతప్తి చెందాడు. జరిమానా చెల్లించి బ్రతుకు జీవుడా అని ఇంటి వైపు వెళుతూ ఇక ఎప్పటికీ పాలల్లో నీళ్ల కలపకూడదన్న నిర్ణయానికి వచ్చాడు.

గూఢచారులను పిలిపించి బకాసురయ్య అభివృద్ధికి కారణమేమిటో తెలుసుకొని రమ్మని ఆదేశించాడు సుబుద్ధి .కొన్ని రోజుల వ్యవధిలోనే అసలు రహస్యం కనిపెట్టి న్యాయాధికారికి వివరంగా తెలిపారు.

న్యాయాధికారి ఆదేశానుసారం బకాసురయ్యతో పాటు అతని భార్య,అతని తల్లితండ్రులనుసైనిక భటులు తీసుకొని వచ్చారు.

" బకాసురయ్యా నీవు ఇంతటి ధనవంతుడివి ఎలా అయ్యావో నిజం చెప్పావంటే తక్కువ శిక్ష పడేలా చూస్తాను.లేదా నీవు కఠిన శిక్ష అనుభవించవలసివస్తుంది." అన్నారు న్యాయాధిపతి సుబుద్ధి.

"అయ్యా కల్తీ వ్యాపారం చేసి ఎక్కువ ధనం సంపాదించాలన్న ఆశతో పలు గ్రంథాలను పరిశీలించి కల్తీ పాలు తయారుచెయ్యడం కనుగొన్నాను.ఆ కల్తీ పాల వ్యాపారంతో నేను గొప్ప ధనవంతుడినయ్యాను" అన్నాడు బకాసురయ్య.

" కల్తీ పాలు ఎలా తయారు చేస్తున్నావు" అడిగాడు సుబుద్ధి.

"అయ్యా, పంది కొవ్వు కొన్ని విషమూలికలు కలిపి తయారు చేస్తాను. ఒక శేరు పాలతో పదిహేను శేర్ల పాలను తయారు చేసాను. పాలు తెల్లగా చిక్కగా ఉండటం వల్ల ఎవరికీ అనుమానం కలుగలేదు."అన్నాడు బకాసురయ్య.

"ఈ కల్తీ పాలు వాడటం వల్ల ఎటువంటి క్లిష్ట సమస్యలు వచ్చాయో తెలుసా? అభం శుభం తెలియని కొంతమంది పిల్లలు మరణించారు..కల్తీ పాలు అన్ని విధాలా చాలా ప్రమాదం అన్న సంగతి తెలుసా? " అడిగాడు సుబుద్ధి.

"బకాసురయ్యా నీవు చేసిన విషపూరిత పాల వ్యాపారానికి చాలా కఠినమైన శిక్ష విధించాలి. కానీ ఒక్క సారి ప్రశ్నించగానే నిజాన్ని చెప్పినందున నీకు శిక్ష తగ్గించాలనుకొంటున్నాను.న్యాయా శాస్త్ర గ్రంథాల ప్రకారం అందులో ఉన్న శిక్షను తగ్గించాలంటే రాజుగారి అనుమతి కావాలి.రెండురోజుల్లో వారి అనుమతి తీసుకొని నా తీర్పు చెబుతాను.అంతవరకు మీరందరూ చెరసాలలో ఉండండి."అన్నాడు సుబుద్ధి.

ఆ మాటలు బకాసురయ్యాకు ఊరట కలిగించాయి. తనకు పెద్ద శిక్ష పడదనే భావనకు వచ్చాడు. రెండు రోజులు చెరసాలలో గడిపినతరువాత మూడవరోజు న్యాయపరిపాలనాధికారిముందు నిలబెట్టాయారు.

"బకాసురయ్యా ఒక హత్య చేసిన వాడికి మరణశిక్ష విధిస్తారు. నీ కల్తీ పాల వల్ల ఎంతమంది అనారోగ్యానికి గురయ్యారో, ఎంత మంది మరణించారో సరిగ్గా నిర్ణయించ లేక పోతున్నాం. న్యాయ శాస్త్రంలో నీలాంటి వారికి నగరం నడి బొడ్డున ప్రధాన కూడలినందు నిన్ను కుక్కను కొట్టినట్లు కొట్టాలి. అలాగే నీ వ్యాపారంలో సహకరించిన నీ కుటుంబ సభ్యులకు ఉరిశిక్ష వెయ్యాలి." అన్నారు న్యాయాధిపతి సుబుద్ధి

" శిక్ష తగ్గించమని....."చేతులు జోడిస్తూ అడిగాడు బకాసురయ్య.

"శిక్ష తగ్గించడానికి అనుమతించారు. నీ కుటుంబ సభ్యులకు యావజ్జీవ కారాగారశిక్ష విదిస్తున్నాము. అలాగే వారంలో ఒకరోజు నగరం నడిబొడ్డులో ప్రధాన కూడలివద్ద నిన్ను నిలబెట్టి ప్రజలకు నిన్ను తిట్టేందుకు అనుమతించాలని రాజుగారు ఆదేశించారు అన్నాడు.

" అయ్యా, నేను , ప్రధాన కూడలి మధ్యలో నిలబడలేను.నన్ను ముందుగానే ఉరితీయ్యండి"అంటూ భోరుమని విలపించాడు బకాసురయ్య .

ఇలా చేయడం వల్ల కల్తీ వ్యాపారం చెయ్యాలన్న తలంపు రాకుండా వ్యాపారస్థుల్లో కనువిప్పు కలుగుతుంది."అన్నారు సుబుద్ధి.

- ఓట్ర ప్రకాశరావు
09787446026

కాకులు చూపిన దారి



కనకాపురంలో కామయ్య, సీతమ్మ దంపతులకుకు ఇద్దరు పిల్లలు. రాము, రంగ. బీద కుటుంబం కావటం వల్ల తల్లిదండ్రుల కష్టం చూడలేక పదవ తరగతితో చదువు ముగించాడు. రాము, తమ్ముడినైనా బాగా చదివించాలనే కోరికతో ఉద్యోగాల వేటలో పడ్డాడు. పత్రికలో పడిన ఒక ప్రకటన చూసి రాము, రంగని తీసుకొని బయలుదేరాడు. ఒక డాక్టరు వద్ద అటెండరు పని అది. దారిలో గేటుపడింది. స్టాండ్ వేసి నిలుచున్నారు ఇద్దరు. ఇంతలో ఒక ఆర్తనాదం విని తలతిప్పి చూశారు. ఒక వ్యక్తి నేలపై పడి కొట్టుకుంటున్నాడు. యాక్సిడెంట్ అయ్యింది. తనను డాక్టరు వద్దకు తీసుకెళ్లమని బాధ భరించలేకపోతున్నానని ఏడుస్తున్నాడు. చాలామంది చూస్తున్నారు కానీ ఎవరూ ముందుకు రావటంలేదు. ఇంతలో గేటు తెరిచారు. అందరూ ముందుకు సాగిపోయారు.

"అన్నయ్యా అతన్ని తీసుకెళ్దామా" అడిగాడు రంగ.

"నీకు పిచ్చా ఏమిటి? అందరూ ఎందుకు పట్టించుకోలేదు? ఆ తలనొప్పులన్నీ పడలేము డాక్టరు ఖర్చు భరించాలి. పోలీసులకి సమాధానం ఇవ్వాలి. పైగా మనం సమయానికి ఇంటర్వ్యూకి వెళ్లకపోతే ఉద్యోగం వేరే వాళ్ళకి ఇచ్చే అవకాశం ఎక్కువ" అంటూ చిరాకు పడ్డాడు రాము.

ముందుకు సాగారు వాళ్లకూడా. అయితే, రంగడి చెవుల్లో అతని ఏడుపు వినబడుతూనే ఉంది. దారిలో ఒక కాకుల గుంపు కనబడింది. ఒక కాకి కిందపడి ఉంది. కొన్ని కాకులు అరుస్తున్నాయి. చుట్టూ చేరి మరి. కొన్ని వచ్చి చేరుతున్నాయి. అన్నీ కలిసి కిందబడిన కాకిని లేపి పట్టుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నాయి. కాకుల్లో ఆ ఐకమత్యం గురించి రంగా విన్నా కానీ, చూడటం అదే మొదటిసారి.

"అన్నయ్యా చూశావా? నోరులేని పక్షులే ఒకదానికొకటి సహాయం చేసుకుంటూ, కష్టసమయంలో ఆదుకుంటున్నాయి. మనమెందుకు అలా ఉండము" అన్నాడు దిగులుగా.

"నిజమే పదా" అంటూ సైకిల్ వెనక్కి తిప్పాడు రాము. ఒక ఆటోను పిలిచారు. ఉన్న డబ్బులతో ఏదో ఒక సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. తాము వెళ్లేది డాక్టరు వద్దకే కాబట్టి అతనిని అక్కడికే తీసుకెళ్లారు. అయితే ఆ వ్యక్తి డాక్టరుగారి తండ్రే. వీళ్ళు చేసిన సాయానికి డాక్టరుగారు ఎంతో సంతోషించి ఆ ఉద్యోగం రాముకే ఇచ్చారు. తమ పరోపకారమే ఉపకారమయిందని ఆనందించారు అన్నదమ్ములు.

- ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి
9849464017

సీరియల్

ఇరుగింటావిడ: ఈ మధ్య వస్తున్న టీవీ సీరియల్సేమైనా చూస్తున్నావా వదినా..?

పొరుగింటావిడ: అబ్బే ఈ సీరియల్స్‌తో విసుగెత్తిపోయింది. వాస్తవ జీవితమే ఎంతో హాయిగా ఉంది.

ఇరుగింటావిడ: వాస్తవ జీవితమా? ఎప్పుడు మొదలైంది? ఏ ఛానల్లో ? ఎన్ని గంటలకొస్తుంది?

అనుభవం

సాటి రచయిత: మొన్న ఒక పత్రికలో మీ కథ చదివాను. నా కంటే మీరు చిన్న వారైనా అనుభవం మాత్రం పెద్దది.

తోటి రచయిత: ఏం అలా అంటున్నారు?

సాటి రచయిత: ఏం లేదు. నేను ముప్పై సంవత్సరాల నాటి కథలు కాపీ కొడితే.. మీరు యాభై సంవత్సరాల నాటి కథలు కాపీ కొడుతున్నారు!

మలుపు



ఎడిటర్ : ఏంటమ్మా ఇది? మీ కథల్లో దాదాపు ప్రతి పేరాలోనూ స్కూటర్ మలుపు తిరిగింది, కారు మలుపు తిరిగింది లాంటి వాక్యాలు కనిపిస్తున్నాయి?

రచయిత్రి : అదేంటి సార్....కథల్లో ఎన్నో మలుపులుండాలని మీరేకదా అన్నారు?

తొలి చికిత్స

తెలుసా

★ సరైన సమయానికి ప్రథమ చికిత్స అందక మన దేశంలో ప్రతి సంవత్సరం డెబ్బై వేల మందికి పైగా చనిపోతున్నారనేది ఒక అంచనా. వీరిలో పాము కాటుతోపాటు హార్ట్ స్ట్రోక్‌తో చనిపోయిన వారే ఎక్కువ.

★ టిఐఎ (ట్రేన్సియంట్ ఎస్కెమిక్ ఎటాక్)ను హార్టెటాక్ రావడానికి నిజమైన హెచ్చరికగా పరిగణిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఇలా మొదటి టిఐఎ వచ్చినవారిలో మూడొంతుల మంది ఐదేళ్ళలోపే మెదడు లేదా హార్ట్ స్ట్రోక్‌కు గురవుతున్నారనేది ఒక అధ్యయనం.

★ కంటిగాయాల్ని సాధారణంగా చల్లని నీళ్ళతో కడుగుతుంటాం. కానీ కంటికి ఏదైనా గాయం అయితే ముందుగా కంటి గుడ్డును గోరువెచ్చని నీటితో శుభ్రంచేయాలి. ఇలా పది పదిహేను నిమిషాలు శుభ్రం చేశాక గాయంపై కాటన్ పట్టీతో బ్యాండేజ్ వేయాలి.

★ శరీరంపై ఏదైనా గాయం అయితే వెంటనే అక్కడ చర్మాన్ని గట్టిగా రుద్దేస్తుంటారు. ఇలా చేయడం ద్వారా ఆ ప్రాంతానికి రక్తం మరింత వేగంగా ప్రసరించి ఎక్కువ రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉంది. గాయం అయిన వెంటనే చర్మాన్ని రుద్దకుండా ఆ ప్రాంతంలో ఐస్ ముక్కతో మర్దనా చేయడం ద్వారా ఉపశమనం ఉంటుంది.

★ కొంతమందికి తరచుగా ముక్కు నుంచి రక్తంకారడాన్ని గమనిస్తుంటాం. శ్లేష్మ పొరల్లోని చిన్న చిన్న రక్తనాళాలకు గాయం కారణంగా ఇలా ముక్కు నుంచి రక్తం కారుతుంది. అయితే రక్త స్రావం అయ్యే సమయంలో ఎక్కువమంది తలను వెనక్కు వంచడం, తల వెనక్కు వాల్చి పడుకోవడం లాంటివి చేస్తుంటారు. ఇలా చేయడం ద్వారా తలపై రక్తపోటు పెరగడంతోపాటు రక్తస్రావం మరింత ఎక్కువవుతుంది. దీనికి చేయాల్సింది ముందుగా నాసికా రంధ్రాల్ని చూపుడు, బొటనవేలుతో పది నిమిషాల పాటు మూసి ఉంచాలి. అప్పుడు నోటి ద్వారా గాలిని తీసుకోవచ్చు. ఇలా చేయడం ద్వారా ముక్కు నుంచి రక్త స్రావం తగ్గుతుంది.

★ యుకెలో ప్రథమ చికిత్స అందక ఈ ఏడాది అక్కడ దాదాపు లక్ష నలభైవేల మంది చనిపోయారనేది ఒక నివేదిక.

★ ప్రపంచవ్యాప్తంగా ప్రతి పది మంది చిన్నారుల్లో నలుగురు మాత్రమే ఫస్ట్ ఎయిడ్ గురించి తెలిసిన వారున్నారనేది ఒక అంచనా.

★ ప్రపంచవాప్తంగా విమాన ప్రయాణీకుల్లో ఎక్కువగా శ్వాస సంబంధిత కారణాలతో చనిపోతున్నారనేది ఒక అధ్యయనం.

★ పాము కాటు సందర్భాల్లో ఎక్కువగా ఆ విషాన్ని మరొకరు తీసేసేందుకు ప్రయత్నిస్తుంటారు. లేదా కాటు వేసినచోట చర్మాన్ని తొలగించడం లేదా ఏదైనా పసరు, లేపనాల్ని చొప్పించడం చేస్తుంటారు. నిజానికి ఇలాంటివన్నీ సరైనవికావు. పాము కాటు ఉన్న చోట గట్టిగా ఎలాంటి కట్లనూ వేయకూడదు.

★ అత్యవసర పరిస్థితుల్లో వైద్యుని వద్దకు చేరుకునే ముందే ప్రథమ చికిత్స ద్వారా రోగి లేదా గాయపడిన వారి ప్రాణాల్ని కాపాడుకోవచ్చు.

★ ప్రాథమిక చికిత్సపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ శాతం ప్రమాదాల్ని నివారించవచ్చనేది ఒక నివేదిక.

పూదోటలు, అందమైన మొక్కలు, కూర
సాగుకు ట్రాపికల్ గార్డెనింగ్, టెర్రస్ గార్డెనింగ్,
మొక్కల్ని పెంచే రకరకాల విధానాల గురించి మీ
మీరెప్పుడైనా 'ఫ్లోటింగ్ గార్డెన్స్' గురించి విన్నారా..!
ప్రత్యామ్నాయంగా రూపుదిద్దుకున్న ఈ తరహా గా
అజ్‌టెక్‌ల కాలంలోనే అయినా ప్రస్తుతం ఇది ప్రప
పొందుతోంది. ఆ వివరాల్ని మీరూ తెలుసుకో

తేలియా



ఫ్లోటింగ్ గార్డెనింగ్ గురించి చెప్పాలంటే ముందు అజ్‌టెక్‌ల గురించి చెప్పాలి. ఎందుకంటే.. ఈ తరహా గార్డెనింగ్ విధానాన్ని మొట్టమొదట కనిపెట్టింది అజ్‌టెక్‌లే. అజ్‌టెక్‌ల సామ్రాజ్యం విస్తరించిన కాలంలో అలంటే 1428లో మెక్సికో లోయ (వ్యాలీ ఆఫ్ మెక్సికో)లో నీటిపై తేలియాడే విధానంలో మొక్కల్ని పెంచడం మొదలయ్యింది.

అంతకుముందు మెక్సికో లోయ వద్ద స్థిరపడిన జొచిమికా ప్రజలకు అక్కడి నిస్సారమైన చిత్తడి నేలల్లో సాంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్ని అనుసరించి పంటను సాగుచేయడం సాధ్యపడలేదు. ఇక అక్కడి సరస్సుల్లో దీర్ఘచతురస్రాకారంలో అమర్చిన పంటులాంటి నిర్మాణాలపై బెడ్‌లను అమర్చి వాటిపై పండ్లు, కాయగూరల మొక్కల్ని సాగుచేయడం మొదలుపెట్టారు. దానికే చినంపాస్ అని పేరు. దీన్నే ఇప్పుడు మనం ఫ్లోటింగ్ గార్డెనింగ్ అని

వీటి సా
చోటుచేసుకున్నా
నిస్సారమైన నేలలు ఉన్న ప్ర
సాధారణ సాగువిధానాలకు ప్రత
గార్డెనింగ్ విధానం ఆ తర్వాత ప్ర
అయితే, 1998లో మెక్సికోలోని
లాంటి చిన్న నగరాల్లో చినంపాస్
పెంచడం మొదలుపెట్టారు. అలా
రైతులు చినంపాస్ విధానాన్ని అ
సంచలనమయ్యింది. కొన్ని శతాబ్ద
విధానం ఇప్పుడు మళ్ళీ కొత్త పుం

పూదోట

ఫ్రాన్స్‌లో సోమ్ నదిచే విభ

...యల
...కంటెయినర్ గార్డెనింగ్ ఇలా
...రు వినే ఉంటారు. మరి
...సాధారణ మొక్కల పెంపకానికి ఒక
...ర్డెనింగ్ మొదలయ్యింది
...ంచ ప్రాచుర్యం
...ండి.

...తోటలు..

సందర్భం

పిలిచేసుకుంటున్నాం.
...స్ట్ క్లాసిక్, కొలోనియల్ కాలాల్లో
...చేసే విధానాల్లో ఎన్నో మార్పులు
...ు. ఉప్పునీటి సరస్సులు,
...ప్రాంతాల్లో అలా చాలా కాలం
...త్యామ్నాయంగా నిలిచిన ఫ్లోటింగ్
...పంచదేశాలకూ పాకేసింది.
...గాన్‌జార్జియో, మిక్స్‌క్విక్, తలహూక్
విధానంలో కొందరు మొక్కల్ని
... ఆ తర్వాత మిగిలిన దేశాల్లో
...మలుపరచడం ఒక
...లనాటి ఈ పురాతన గార్డెనింగ్
...తలు తొక్కుతోంది.

...ల వంతెన

...జించబడిన నగరం అమీన్స్. రెండు ప్రపంచ యుద్ధాల్లో భయానక యుద్ధవాతావరణానికి నిదర్శనంగా మారిన ఈ నగరం ఇప్పుడు పచ్చని పూదోటలతో శోభిస్తోంది. దీనికి కారణం అక్కడి ఫ్లోటింగ్ గార్డెన్‌లే. ఇక్కడి యాభైకిపైగా చిన్న చిన్న గ్రామాలకు అనుసంధానంగా ఉండే ఇరుకైన పిల్లకాల్వల్లో ఈ పూదోటలుంటాయి. ఈ పూదోటల్ని వీక్షించేందుకు వంతెనల్ని కూడా ఏర్పాటు చేశారు. ఇక ఈ కాల్వలపైనే ఫ్లోటింగ్ గార్డెనింగ్ విధానంలో కూరగాయలు, పూలమొక్కల్ని సాగుచేస్తుంటారు. ఇక్కడ పండించిన పళ్ళు, కూరగాయలతో వారానికోసారి మార్కెట్ (సంత) నిర్వహిస్తుంటారు. అది కూడా పడవల పైనే. అందమైన పూదోటలు, పచ్చని చెట్లతో కనువిందు చేసే ఈ ప్రదేశం టూరిస్టులకూ ఒక ప్రత్యేక ఆకర్షణ.

వైపరీత్యాల్ని అడ్డుకుంటూ..

ఈ తరహా గార్డెనింగ్ కొన్ని దేశాల్లో ఫేమస్ అవ్వడానికి ఒక రకంగా ప్రకృతి వైపరీత్యాలే కారణం. ఇలా ప్రకృతి వైపరీత్యాల్ని ఎదుర్కొంటున్న దేశాల్లో బంగ్లాదేశ్ ఒకటి. తరచుగా పెద్ద ఎత్తున వరదల్ని చవిచూస్తున్న బంగ్లాదేశ్‌లో ఫ్లోటింగ్ గార్డెనింగ్ ఒక చక్కని పరిష్కారాన్నిచ్చింది. సాధారణంగా ఫ్లోటింగ్ గార్డెనింగ్‌కు వెదురు బొంగుల్ని ఉపయోగిస్తారు. అయితే, ఇక్కడ ఫ్లోటింగ్ గార్డెనింగ్ విధానంలో చేసే విధానానికి గుర్రపు డెక్కను ఉపయోగిస్తారు. మైళ్ళ దూరం పెరిగిన గుర్రపు డెక్కపై బంకమట్టిని వేసి వాటిపై మొక్కలు పెంచే విధానాన్ని అవలంబిస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో కర్రలతో పందిళ్లను వేసి కూరగాయల్ని పండిస్తుంటారు. ఆకుకూరలు, కూరగాయలు ఇలా అన్నిటినీ ఫ్లోటింగ్ గార్డెనింగ్ విధానంలోనే పండించేస్తుంటారిక్కడ. ప్రస్తుతం ఈ విధానాలను అక్కడి ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకూ బోధిస్తున్నారు.

పోటీపడి పెంచుతారు..

థాయిల్యాండ్‌లోని వజీరలాంకోర్న్ సరస్సుకు అతి సమీపంగా ప్రాంతం సంగక్లాబురి. నీటిపై తేలియాడే ఊరిగానూ ఇది ప్రాచుర్యం పొందింది. ఇక ఇక్కడ నివసించే వారందరికీ చేపల వేట ప్రధాన జీవనాధారం. ఇక ఇక్కడి వారంతా తమ ఇంటింటి ముందే తేలియాడే తోటల్ని ఏర్పాటు చేసుకుంటుంటారు. ఈ తోటల్లో వీరు ఎక్కువగా కూరగాయలు, పండ్లను పండిస్తుంటారు. ఇక వీటిని ఏర్పాటుచేయడంలో వారు ఎక్కువగానే శ్రమిస్తుంటారు. పాత కలపను ఉపయోగించి మొక్కలు పెంచేందుకు బెడ్‌లను తయారుచేసుకుంటారు. సరస్సులో దొరికే మట్టి, ఇతర మొక్కల్ని పడవల్లో తీసుకొచ్చి వాటిని కలపపై పరుస్తారు. అలా తయారుచేసిన చదునైన ప్రదేశంలో మొక్కల్ని పెంచుతుంటారు. ఇవి కాకుండా వెదురు బొంగుల్ని నీటిలో పాతి వాటిపై తీగె మొక్కల్ని పెంచుతుంటారు. ఇలా పెద్ద ఎత్తున వీరు పెంచే మొక్కలకు ఇక్కడ పోటీలు కూడా జరుగుతుంటాయి.

ఫ్లోటింగ్ గార్డెనింగ్ విధానాన్ని వివిధ ప్రాంతాల్లో కూరాగాయల సాగుకో, అందమైన ఉద్యానవనాల్ని ఏర్పాటుచేయడానికో ఉపయోగిస్తుంటే హైద్రాబాద్‌లో మాత్రం ఈ విధానాన్ని ఓ సరస్సు ప్రక్షాళనకు ఉపయోగిస్తున్నారు. హైద్రాబాద్‌లో అత్యంత కలుషితమైన సరస్సుల్లో నెక్నంపూర్ సరస్సు ఒకటి. పెద్ద ఎత్తున దుర్గంధం వ్యాపిస్తున్న ఈ సరస్సును శుభ్రం చేయడం అంటే, అంత సులువైన విషయంమేం కాదు. అయితే, ఈ సరస్సును శుభ్రపరచడంలో ఫ్లోటింగ్ గార్డెనింగ్ ఒక ప్రత్యామ్నాయంగా నిలిచింది. ఒకప్పుడు అత్యంత కలుషితమైన ఈ సరస్సు నీటిని ఫిల్టర్ చేయడం అక్కడి వారికి కష్టమైంది. ఎందుకంటే అక్కడ వ్యాపించే దుర్గంధానికి ఆ సరస్సు దరిదాపుల్లోకి కూడా ఎవరూ వెళ్ళలేరు. అయితే సరస్సును ప్రక్షాళన చేయాలంటే ముందుగా ఆ దుర్గంధాన్ని తగ్గించాలి. అందులో భాగంగా అక్కడ ఫ్లోటింగ్ గార్డెనింగ్ ఆలోచన అమలుచేశారు. వెదురు కర్రలపై స్టైరోఫోమ్ బాక్సుల్ని అమర్చి వాటిలో గోనెసంచుల్ని అమరుస్తారు. ఎలాంటి మట్టి అవసరం లేకుండానే వాటిలో మొక్కల్ని పెంచొచ్చు. అలా పెద్ద ఎత్తున తులసి, అశ్వగంధ మొక్కల్ని పెంచడం మొదలుపెట్టారు. ఇలా కొంత దుర్గంధాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. ధ్రువన్ ఎన్‌జివో సంస్థ వ్యవస్థాపకురాలు మధులిక చౌదరి చేసిన ఈ ఆలోచన ఇప్పుడు ఓ మంచి ఫలితాన్నిస్తోంది.

- అద్దేపల్లి శర్వాణి

శ్రమ దోపిడీ

కథ

- గూడూరు గోపాలకృష్ణ మూర్తి
7382445284

"ముత్యాలమ్మ! నీవు పని సరిగా చేయలేకపోతున్నావు. చూడు గిన్నెలు బాగా తోమలేకపోతున్నావు. ఇది నీ తప్పు కాదు నీ వయస్సే అలాంటిది. చిన్నదానివేఁటి ఎనభై ఏళ్లదానివి. అందులోనూ చూపు సరిగాలేదు. వంగి నడుస్తున్నావు. నీ చేత పని చేయించడానికి మాకే బాధగా ఉంది. నీ మనుమరాల్ని పని చేయమని చెప్తే నిన్ను పంపింది. బుద్ధి ఉండొద్దు. రోజూ నాకు నీతో అరుపులు తప్పటం లేదు. విసుగ్గా అంటోంది సుమతి పెరట్లో.

క్లాసులో రేపు చెప్పబోయే పాఠాన్ని ఓ పర్యాయం చూసుకుంటున్న నాకు సుమతి మాటలు వినిపించాయి. సుమతి చెప్పింది నిజమే. పాపం ముత్యాలమ్మ ఎనిమిది పదుల వయసులో ఇంత ఓపిగ్గా పని చేస్తోందంటే చెప్పుకోదగ్గ విషయమే.

మా పిల్లలు కూడా'వచ్చినప్పుడల్లా "పాపం ఆ ముసలిదానితో పనిచేయిస్తారేమిటి? వేరే పని మనిషిని చూసుకోకుండా అని అంటారు. "నీవు చేయలేవు పని మానెయ్ ముత్యాలమ్మ! అంటే ఊరుకుంటుందా "నా లాగ ఎవతి పనిసేస్తదమ్మా!" అంటుంది. సుమతితో.

నేను కూడా ఓ పర్యాయం ముత్యాలమ్మతో సుమతి అన్నట్టే అన్నాను.

"బాబు! అందరూ అలాగే అంటే నా బతుకెలా ఎల్తాదయ్యా? నా ఇసయాలన్నీ మీకెరుకే కదా!" జాలిగా ముఖంపెట్టి అంది. ఆమె చెప్పినట్టే ముత్యాలమ్మ కుటుంబ విషయాలు నాకు తెలిసి ఉండటం వల్ల ఆమె అలా అంటూ ఉంటే కడుపులో దేవురించినట్లయింది. మరేఁ మాట్లాడలేక పోయాడు తను.

మన మనస్సు ఈ దయాభావంతో నిండిన హృదయం ఎదుటి వాళ్లని చల్లబర్చడానికి సాంత్వన చేకూర్చడానికి ప్రయత్నిస్తుంది. దయకి స్వపర బేధం ఉండదు. మేఘం వర్షిస్తుంది. ఫలానా చెట్టు మీద మాత్రమే వర్షించాలనే పరిమితి ఏర్పరుచుకోరు. నిజమైన దయ కూడా అంతే. తనవాళ్ల మీదే దయ చూపాలని అనుకోకుండా బాధాతప్తుల మీద కూడా దయచూపాలని, అదే మానవత్వం అని నేను అనుకుంటాను. ఇలా ఆలోచిస్తున్న నాకు ఒక్కసారి ఆమె కొడుకు జ్ఞప్తికి వచ్చాడు.

మనుష్యుల్లో ఎంత స్వార్థపరులున్నారు? అదీ తల్లి దగ్గరా ఈ స్వార్థం? ఆమె రుణం పిల్లలు ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేరు. తల్లి తన గర్భంలో ఎంత తాపత్రయ పడుతుంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. మరి ఈ తరువాత? శిశువు పెరిగి పెద్దవాడయ్యి తమ కాళ్ల మీద తను నిలబడే వరకు తన పిల్లలకోసం ఎంత తాపత్రయ పడుతుంది? తాను ఆకలితో ఉన్నా తన పిల్లల ఆకలి తీర్చడానికి ప్రయత్నిస్తుంది. అటువంటి తల్లి దగ్గరా ఈ స్వార్థం? అని అనుకుంటున్నాను నేను.

ఆ ముత్యాలమ్మ కొడుక్కి భావోద్వేగాలు లేవు కాబోలు. మన సంస్కృతి సాంప్రదాయాల్లో సామాజిక మైత్రి బంధాలు అనుబంధాల్లో రక్త సంబంధాల్లో ఈ భావోద్వేగాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. ముత్యాలమ్మ విషయంలో కొడుకు ప్రవర్తన తీరు ఆమె భావోద్వేగాల్లో బాధనే మిగిల్చింది.

ముత్యాలమ్మ కొడుకు గురించి తనకి తెలియనప్పుడు ఆమెతో "ముత్యాలమ్మ! ప్రభుత్వం వృద్ధాప్య పెన్షను ఇస్తోంది కదా! అవి చేతి ఖర్చులకి ఉంచుకుని కొడుకు దగ్గర చక్కగా ఉండొచ్చు కదా" అన్నాను. నాకేఁ సమాధానం ఈయలేదు కాని ఆమె కళ్లల్లో కన్నీటతో నన్ను విచలితుడ్ని చేసింది. ఎవరి కంట్లోనేనా కన్నీరు రానంత వరకు వాళ్లు, వాళ్ల చుట్టూ ఉన్న సమాజం బాగున్నట్టే వాళ్ల కంట్లో నీళ్లు వచ్చాయంటే వాళ్లో, వాళ్ల చుట్టూ ఉన్న సమాజం బాగోలేనట్టే. ఇటువంటి సమయంలో మన చుట్టూ ఉన్న సమాజాన్ని బాగు చేయలేక పోయినా, కన్నీళ్ళు రాకుండా తనని తాను బాగు చేసుకోవచ్చు. వీలయితే సమాజాన్ని బాగు చేయవచ్చు. అంతేకానీ, ఏడుస్తూ కూర్చోకూడదు అనేదే ముత్యాలమ్మ భావన.

ఆమెకి వచ్చిన కన్నీళ్ళు బాధ వల్ల కావచ్చు, తనవాళ్ళ వల్ల కావచ్చు. ముత్యాలమ్మ కొడుకు విషయంలో తీసుకుంటే, తను విన్న విషయాన్ని బట్టి అతను అంత స్వార్థపరుడా? మనిషి అన్న వారికి ఈ మాత్రం స్వార్థం ఉండొచ్చు కానీ, అది ఎదుటి వాళ్ల జీవితాన్ని దెబ్బతీసే విధంగా ఉండకూడదు.

సమాజంలో మనిషి స్థానంలో హృదయం, మానవత్వం లేని మార్కెట్టు వచ్చి చేరింది. జీవం లేని డబ్బు ప్రధానమయిపోయింది. బంధాలు, బాంధవ్యాలు ఈ డబ్బు దగ్గర వెలవెలబోతున్నాయి.

ఓ పర్యాయం ముత్యాలమ్మ అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. "బాబు! ఈ పాటి నేను సంపాదించి తెస్తూ ఉంటే నాకు ఇంత ముద్ద పడేస్తున్నాడు. లేకపోతే నా బతుకు ఎలా ఉంటదో ఆలోసించండి" కన్నీళ్ళు పెట్టుకుని అంది. అందుకే ఆమె పని సంతృప్తి ఈయకపోయినా పని మనిషిని మార్చకుండా సర్దుకుపోతున్నాం.

జీవితంలో ఎన్నో ఆటు పోట్లని చూసింది. కష్టాలు, కన్నీళ్ళతో ఆమె జీవితం గడిచిపోయింది. మనసులో బాధ హృదయాంతరంలో దాచుకుని పైకి ఉబికి వస్తున్న దు:ఖాన్ని గుండెల్లో దాచుకుని జీవిత చరమాంకాన్ని ఇలా గడిపేస్తుంది.

• • •

కొడుకు, కూతురు పుట్టి ఎన్నాళ్ళో అవలేదు భర్తను కోల్పోయింది. ముత్యాలమ్మ కొడుకు చిన్నవాడు. కూతురు పెద్దది కూతుర్ని ఎలిమెంటరీ చదువుతోనే ఆపేసి తన అన్నదమ్ముడు కొడుక్కిచ్చి పెళ్ళి చేసింది. అష్టకష్టాలు పడి కొడుకుని కాలేజీ చదువు చదివించింది. అందుకోసం తాను పొలం పనులకి వెళ్ళింది. గోతులు తవ్వేది. మొక్కలకి నీళ్ళు పోసేది. కొంతమంది ఇళ్ళల్లో పాచి పని చేసేది. కొవ్వొత్తి తాను మండిపోతూ పరిసరాలకు వెలుగునిచ్చినట్టు తను కష్టపడుతూ తన కొడుక్కి మంచి భవిష్యత్తు ఈయలనుకుంది ముత్యాలమ్మ. కొడుకు బ్యాంకు టెస్టులు రాసి సెలక్టు అయితే తన కష్టాలు తీరిపోతాయని ఆమె ఎంతో మురిసిపోయింది? అయితే ఆ సంతోషం మూడునాళ్ళ ముచ్చటే అని తెలుసుకోలేకపోయింది. కొడుక్కి ఓ సర్పంచ్ కూతురు సంబంధం వస్తే "అప్పా! బంగారు కత్తినను కుని మెడ కోసుకుంటామా. మనకి తగిన సంబంధం కాదు ఇది. సమాన ఇయ్యం, సమాన కయ్యం అంటారు. ఈ సంబంధం సేసుకుంటే మనవడి మీద ఆన వదులుకోడమే!" తమ్ముడు ముత్యాలమ్మకి నచ్చజెప్పు చూశాడట. అయితే, ముత్యాలమ్మ వింటే కదా! "పోనిద్దూ తమ్మా! ఆడేనా సుకపడాల లేమిలో పుట్టాడు లేమిలో పెరిగాడు ఇప్పుడయినా సుకంగా ఉండాలి. ఆడి జీవితం కోసం నాను ఏం అయిపోయినా పరవాలేదు. "అందిట ముత్యాలమ్మ. చదువూ సంధ్యా లేకపోయినా ఆమె ఎంత ఉదార బుద్ధి ప్రదర్శించింది అని అనుకున్నాను నేను. ఈ విషయం తెలిసినప్పుడు, పెళ్ళి అయి మూడు నిద్రలు అవకుండానే కోడలు కొడుకుని తీసుకుపోతే "అయిన దానీ సంబడం ఈ సంబంధం వద్దే అమ్మా అంటే పట్టు పట్టి ఈ సంబంధం కొడుక్కి సేసినావు అని కూతురు నిలదీసి సూటిపోటి మాటలంటే బాధను మనస్సులోనే దాచుకుని ఇదంతా నా కర్మ అని నుదురు కొట్టుకుని మౌనంగా రోదించిందట ముత్యాలమ్మ. పోనీ కొడుకు ఆమెనైనా తన దగ్గరకు తీసుకెళ్ళాడా అంటే అదీ లేదు, అతను బ్యాంకు మేనేజరు పొజిషన్‌లో ఉన్నాడు. తల్లిని తీసుకువెళ్తే తన ప్రిస్టేజికి భంగం తన పరువు పోతుంది అనుకుని తల్లిని తీసుకెళ్ళలేదు కదా, తన పిల్లల పెళ్ళిళ్ళకి మిగతా శుభకార్యాలకి కూడా అందరూ బంధువుల్ని ఆహ్వానించాడు కానీ, తల్లిని తీసుకురమ్మనమని చెప్పలేదు. తన వాళ్ళందరూ కొడుకు ఇంటి శుభకార్యాలకి వెళ్తూ ఉంటే ఆమె మాత్రం బాధనంతా గుండెల్లో దాచుకుని ఉండిపోయింది. ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్లు, మూడిళ్ళలో పాచి పని చేస్తే వచ్చిన డబ్బు ఈ డబ్బంతా కూతురికిస్తే ఇంత తిండి పడేస్తోంది కూతురు. ఆ వయస్సులో కూడా ఆ మాత్రం పని చేయకపోతే తిండే ఉండదు అంటుంది ముత్యాలమ్మ.



"ఓ ముసలిదానా! నీకెంత పచ్చపాతమే! సిన్నప్పుడు మాయమ్మకి గంజిబువ్వ ఎట్టి నీ కొడుక్కి పాలూ బువ్వ ఎట్టేదానివిట. అంత పచ్చపాతం ఉండటం వలనే నీ కొడుకు అలా సేసినాడు". మనుమరాలు దెప్పుతూ మాట్లాడుతుంటే, ఆ సూటి మాటలకి మనస్సులో బాధపడినా పైకి వ్యక్తం చేసేది కాదు, ముత్యాలమ్మ. ఆమెలో ఒక్క సుగుణం మాత్రం మెచ్చుకోవాల్సిందే అదే నిబద్ధతతో పనిచేయడం. పెళ్ళున ఎండకాస్తున్నా ఎంత వర్షం పడినా నాగాలు పెట్టకుండా అంత పెద్ద వయస్సులోనూ పనికి టంచనుగా వచ్చి పని చేసుకుని వెళ్ళిపోయేది.

ఆ ముసలిదానికి ఉదయాన్నే టిఫిను అక్కర్లేదు. ఇంత చుక్కకూడా ఇంట్లో దొరికేది కాదు. అందుకే నాగాలు పెట్టకుండా హైరానా పడ్తూనే పనికి వచ్చేది. పనిచేయించుకునే వాళ్ళు ఇంత తినడానికి పడేస్తే తినేది. అయితే ఆమెలో కూడా ఓ విశేషగుణం ఉంది. అది ఆత్మాభిమానం అనచ్చు, మరేదైనా అనచ్చు. నేరుగా తనకి టిఫిను పెట్టమని అడిగేది కాదు, "ఇంకా గిన్నెలున్నాయా;" అని అడిగేది. ఈమె భావం కనిపెట్టి తినడానికి ఏదో ఇంత పడేస్తే తినేసి వెళ్ళిపోయేది. అంతేకాదు, ముత్యాలమ్మది మొండి ప్రాణం. ఎందుకంటే ఎన్నో పర్యాయాలు పడిపోయింది. దెబ్బలు తగిలాయి. అయినా, నిలదొక్కుకుంది. అలాగే పనికి వచ్చేది. జ్వరం వచ్చినా కూడా నాగా పెట్టేదికాదు, నడుం వొంగిపోయినా అలా వొంగి నడుచుకుంటూ వచ్చేది. అందుకే నేను ముత్యాలమ్మను సమర్థిస్తాను. ఆమె మీద ఒకింత జాలి చూపిస్తాను.

అందుకే సుమతితో "ముత్యాలమ్మ శ్రమను దోపిడి చేస్తున్నాం. ఎందుకిలా రోజూ సణుగుతావు?" అని అన్నాను. నా మాటలకి సుమతి ఊరుకుందా? లేదే! "ఆ: చెప్పి చెప్పి మీరే చెప్పాలి. శ్రమదోపిడి వలనే కదా మీకు జీతం వస్తోంది. అదంతా ఎందుకు ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు బొంగరంలా తిరుగుతూ ఎవరి అవసరాలు వారికి తీరుస్తూ విశ్రాంతి లేకుండా శ్రమిస్తాను. నా శ్రమను మీరందరూ దోపిడి చేయటం లేదా? అదంతా ఎందుకు ఈ కార్పోరేటు స్కూళ్ళ యజమానులు ఉపాధ్యాయులకి అంతేసి జీతాలు ఎందుకు ఇస్తున్నాం అని ఉదయం నుండి రాత్రి వరకు వాళ్ళ శ్రమను దోపిడి చేయటం లేదా? అడ్డమైన హోమ్‌వర్కులిచ్చి పిల్లల్ని యంత్రాల్లా మార్చేసి ఉపాధ్యాయులు విద్యార్థుల శ్రమను దోపిడి చేయటం లేదా? అని ఓ భారీ ఉపన్యాసాన్ని మొదలుపెట్టింది సుమతి.. ముత్యాలమ్మ విషయం చిన్నది చేసే ప్రయత్నంలో. వీటినీ ఖండించాల్సిందే. కానీ, ఇప్పటికిప్పుడు కళ్ళెదుటే ముత్యాలమ్మకు జరుగుతున్న అన్యాయం పట్టించుకోవాలి కదా. ప్రపంచంలోని సమస్యలన్నింటినీ దీనికి ముడివేసి దాటవేసే ప్రయత్నం సరైందేనా..! మనస్సులోనే అనుకున్నా. ప్రభుత్వమిచ్చే వృద్ధాప్య పింఛను ఎటూ సరిపోదు.. ఆమె నెలంతా శ్రమించి అదనంగా సంపాదించే డబ్బుకు సరిపడా ఏదోరకంగా అందించే అవకాశం కోసం ఆలోచిస్తూ బయటకు అడుగేశా. వీధి మలుపు తిరుగుతుండగా.. మరో ఇంటావిడ ముత్యాలమ్మపై పెడుతున్న కేకలు గట్టిగా వినిపిస్తున్నాయి. ✦



3-డి టాట్టూ



టాట్టూ సృజనకారుల్లో ఫ్రెంచ్ ఆర్టిస్ట్ ఇలియట్ కొహెక్ ఒకరు. అతడి గ్రే టాట్టూలు 3-డి ఎఫెక్ట్‌లో కనిపిస్తాయి. చర్మం మీది నుంచి జారిపడిపోతాయేమో అనేలా ఉంటాయి. 19 ఏళ్లకు ఓ టాట్టూ ఆర్ట్ కన్వెన్షన్‌కు వెళ్లిన ఇలియట్‌కు తన భవిష్యత్తు, జీవితం అందులో కనిపించింది. ఇక ఆ కళకే అంకితమైపోయాడు. తొలుత తన స్నేహితుల మీద ప్రయోగాలు చేసి టాట్టూ డిజైన్లను కొత్త పుంతలు తొక్కించాడు. ఇప్పుడు ప్రపంచంలోని అగ్రశ్రేణి టాట్టూ ఆర్టిస్టుల్లో ఒకడిగా గుర్తింపు పొందాడు. హైపర్ రియలిజమ్‌ను ఎక్కువగా ఇష్టపడే ఇలియట్ దానిలో డార్క్ రియలిజమ్‌ను మిళితం చేసి గ్రే, బ్లాక్ టాట్టూయింగ్‌ను తన ప్రత్యేకతగా మార్చేసుకున్నాడు. చార్‌కోల్ (కర్రబొగ్గు)తో వేసే చిత్రాల్లోని యాస్తెటిక్స్‌ను పట్టేసి మోనోక్రోమ్ టాట్టూస్‌ను వేస్తుంటాడు. వాటిల్లోని గాఢత మీకూ కనిపించొచ్చు! చూడండి.







వింతలోకం

కరువు రాళ్ళు

నదులు ఇంకిపోయి రాళ్లు బయటపడేంత కరువులు వచ్చాయని పెద్దలు చెబుతుంటారు. యూరప్‌లోనూ ఇలాంటి కరువు కథలు వినిపిస్తుంటాయి. అయితే, కేవలం జానపద కథల్లోనే కాక నదులడుగున ఉన్న రాళ్లపైనా వాటి వివరాలు కనిపిస్తాయి. కరువు ఏడాది అనో, క్షామపు రాకాసి అనో మాటల్ని ఆ రాళ్లపై చెక్కి, కొన్ని నక్షత్ర గుర్తుల్ని కాలపు ఆనవాళ్లను నమోదుచేస్తుంటారు. ఈ మధ్యే మొదలైన యూరప్‌లోని ఎల్బె నదిలోని నీరు తగ్గి ఇలాంటి చిహ్నాలే కనిపించాయి. నీరు మరింత తగ్గాక 'ఇది చూస్తే మీరు మృత్యుకేక పెట్టినట్టే...' అని రాళ్లపై చెక్కిన మాటలు కనిపించాయి. 'హంగర్‌స్టోన్స్'గా పిలిచే ఈ రాళ్లు 15వ శతాబ్ది నుంచే కనిపిస్తున్నాయట. ఇప్పటివరకూ ఇలాంటి రాళ్లను చాలానే చూశారు. అవి యూరప్‌లో సంభవించిన క్రీ.శ. 1417, 1616, 1707, 1746, 1790, 1800, 1811, 1830, 1842, 1868, 1892-93 కరువుల వివరాలు తెలిపాయి. క్రీ.శ. 1540 తర్వాత అంతలా 2003లో యూరప్‌లో సెగలురేపిన మండువేసవి మీద 'అన్నో 2003' అనే కరువు రాతిని తొలిచారు.

కంగారు హడావిడి

'కంగారూలు ఆస్ట్రియాలో ఉండవు'.... అనే మాటలు రాసిన టీ-షర్ట్‌లు కనిపిస్తాయి ఆ దేశంలో. చాలామందికి ఆస్ట్రియాకు, ఆస్ట్రేలియాకు మధ్య తేడా తెలీక కంగారుపడిపోతారు. తెగ కన్‌ఫ్యూజ్ అయిపోయి ఇక్కడ కంగారూల్ని ఎక్కడ చూడొచ్చని పర్యాటకులు స్థానికుల్ని అడుగుతుంటారు. అందుకే, అందరితో వాగలేక ఇలాంటి టీ-షర్ట్‌ల్ని వేసుకుని తిరగాల్సివస్తోందట. అయినా, ఇక్కడో కంగారూని చూశామని కొందరు సామాజిక మాధ్యమాల్లో కొన్ని వీడియోల్ని పోస్ట్ చేస్తున్నారు. ఇక్కడ కంగారూ కనిపించడమేంటి మతిపోయిందా..! అదేదో వేరేచోట తీసిన వీడియో కావొచ్చని స్థానికులు కొట్టిపడేస్తున్నారు. కానీ, చాలామంది ఉత్తరప్రాంతంలోని కిర్చ్‌స్లాగ్‌లో కంగారూని చూశామని కచ్చితంగా చెప్పడంతో పోలీసులు ఆ చిన్నపట్టణంలో వెతుకులాట మొదలెట్టారు. దగ్గరలోని పచ్చికబయళ్లలో, అడవిలో వారం నుంచి జల్లెడపడుతున్నారు. స్థానిక జూలు, జంతు పెంపకందార్ల దగ్గర వివరాలు కూడా సేకరించారు. కానీ, దీన్ని ఎవరు తెచ్చారో..? ఎలా వచ్చిందో...? అంతుబట్టడం లేదు. అంతకుముందు ఇలాగే ఓ కంగారూ జర్మనీ జూ నుంచి తప్పించుకువచ్చి ఆస్ట్రియాలో తిరిగిందట..! ఒక్క కంగారూనైనా ఆస్ట్రియాలో తిప్పేసి ఆస్ట్రేలియా అనుకునేలా కన్‌ఫ్యూజ్ చేయాలనేది ఎవరిదన్నా తుంటరి ఆలోచనేమో.

మరీ ఫాంటసీలొద్దు

ఫాంటసీ కథలకు విపరీతమైన క్రేజ్. అదే టోల్కిన్స్ నవలలైతే మరీనూ. వాటి నుంచి స్ఫూర్తిపొంది తీసిన 'లార్డ్ ఆఫ్ ది రింగ్స్' చిత్రానికి ఇక్కడ కూడా భారీ ఫ్యాన్స్ ఉన్నారు. కాసేపన్నా ఫాంటసీ లోకంలో గడిపామనే భావన కలిగించే ఆ సాహిత్యం, చిత్రాల్ని ఇష్టపడటంలో తప్పేముంది కానీ, మరీ ఒంటికెక్కించుకుంటేనే సమస్య. ఇల్లినాయిస్‌కు చెందిన కింబెరెల్ ఎవెంటైడ్ అనే అమ్మాయికి ఈ పిచ్చి మరీ తలకెక్కేసి.. ఒంటికి ప్రొస్తెటిక్స్ తగిలించుకుని నిజమైన ఎల్ఫ్‌లా తనను భావిస్తోంది. మిగతా వారిని పోగేసి ఓ కమ్యూనిటీని నిర్మించే పనిలో ఉంది. ఆ సంఘానికి 'అదర్‌కిన్' అనే పేరు పెట్టింది. తనకీ మనిషి పేరు నచ్చక 'ఫైడియన్ స్టార్‌సీడ్' అని పిలిపించుకుంటోంది. అచ్చు సినిమాలోని ఎల్ఫ్‌లానే వస్త్రధారణ చేసుకుంటుంది. అంతేకాదు, ఎల్ఫ్‌ల లక్షణమైన... ప్రకృతితో మమేకమవడమనే కాన్సెప్ట్‌నూ ఆ నగరంలో ప్రయత్నిస్తోంది. ఇంటినిండా, చుట్టూ మొక్కల్ని పెంచుకుని వాటితో మాట్లాడుతుంటుంది. భర్తకు ఈ ఎల్ఫ్ జీవనశైలి మీద అస్సలేం అర్థంకాదట.. కానీ, కింబెరెల్‌కు ఏ విషయంలో అడ్డుచెప్పడంలేదు. ఏంటమ్మా ఇదంతా..? అని ఎవరైనా అడిగితే ప్రశ్న వేసినవారి మతే అంత ఓపెన్‌గా ఉండటంలేదని విసుక్కుంటోంది. మనిషికి మరీ ఫాంటసీలొద్దనేది ఇందుకేనేమో..!

సాత్విక్



సాత్విక్ కాన్వెంట్ స్కూల్లో ఐదో తరగతి చదువుతున్నాడు. ఒక రోజు బస్సు దిగి రోడ్డు దాటి స్కూలు వైపు వస్తుండగా ఒక తాత 'అన్నం తిని మూడు రోజులు అయ్యింది. ఒక పది రూపాయలు ఇప్పించండి' అని అందరినీ అడుగుతూ కనిపించాడు.

సాత్విక్ ఆ తాత దగ్గరకు వెళ్లి తన బ్యాగు లో నుంచి టిఫిన్ బాక్స్‌ను తీసి తన టిఫెన్‌ను అతని గిన్నెలోకి వేసి "తిను తాత" అన్నాడు.

"ఎవరు బాబు నువ్వు పెద్దవాళ్లు కూడా పట్టించుకోవడం లేదు. నువ్వు తెచ్చుకున్న టిఫిన్ కాస్త నాకు పెట్టావు. నీవు ఏం తింటావు ?" అని అడిగాడు తాత.

"ఫర్వాలేదు తాతా నేను మా స్నేహితుల దగ్గర తింటాను".

"నువ్వు చల్లగా ఉండాలి బాబూ".

ఇదంతా అటునుంచి వస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు ప్రసాద్ చూశాడు .

ప్రేయర్. అయిపోయాక ఎవరి తరగతులలోకి వాళ్ళు వెళ్లారు. మధ్యాహ్నం లంచ్ టైం అయ్యింది. అందరూ టిఫిన్ బాక్స్‌లు తెరిచారు.

ప్రసాద్ సార్ సాత్విక్ క్లాస్‌కు వచ్చి తనతో పాటు సాత్విక్‌ని తీసుకొని వెళ్లి తాను తెచ్చుకున్నా టిఫిన్‌ను కలిసి తిన్నారు.

స్కూల్ ఆన్యూవల్ డే వచ్చింది.

ప్రిన్సిపల్ గారు మాట్లాడిన తరువాత బాగా చదివిన వారికి ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానోత్సవం మొదలయింది. సాత్విక్ చదువులోనూ ఆటల పోటీలలోనూ అనేక బహుమతులు అందుకున్నాడు. అందరు చప్పట్లు కొట్టారు. తరువాత ప్రసాద్ సార్ వేదిక మీదకు వచ్చి సాత్విక్ చేసిన పని గురించి చెప్పి పెద్దవాడినైన నాకే ఆ తాత ఆకలి తీర్చాలన్న విషయం తట్టలేదు అని సాత్విక్‌ని పిలిచి ఓ జ్ఞాపికనును అందజేశారు.

తరువాత సాత్విక్‌ను మాట్లాడమని కోరారు.

"నేను స్కూల్లో, ఇంట్లో మా తల్లిదండ్రులు చెప్పిన ప్రతి విషయాన్ని ఏకాగ్రతగా వింటాను. చదువుతో పాటు సమాజంలో ఉన్న సమస్యలను గమనించి మనవంతు సహాయం కొంతైన చేయాలి అన్నది నా అభిమతం" అన్నాడు సాత్విక్.

స్కూల్ ఆవరణ మొత్తం చప్పట్లతో మారుమోగింది.

చివరగా హెడ్ మాస్టారు మాట్లాడుతూ చదువుతో పాటు సాత్విక్‌లా పిల్లలంతా అవసరమైన వారికి కొంతైనా సహాయ పడాలి దీనికి తల్లితండ్రులు కూడా సహకరించాలి అని సభను ముగించారు.

- యు. విజయశేఖర రెడ్డి
9959736475

పిల్లలందరూ మనకు ఆనందాన్ని మాత్రమే కలిగించరు. అల్లరి పిల్లలూ, అకాల పరిణతి చెందిన పిల్లలు కూడా ఉంటారు.

- ఖలీల్ జిబ్రాన్

ప్రపంచాన్ని, ప్రకృతిని, నగరాలను చూడాలని పిల్లలందరికీ ఉంటుంది.
అలాగే మంచి భోజనం, బట్టలు, సినిమాలు ...
ఇలా అనేక కోరికలు ఉంటాయి. అందరికీ అన్ని అవకాశాలు రావు. బాగా చదువుకుని, మంచి స్థితికి వచ్చి చిన్ననాటి కలలను కొందరు తీర్చుకుంటారు.

ఇంకొందరు పిల్లలు 'సాహసం' చేస్తారు.
ఇంటినుండి వెళ్లిపోతుంటారు.
ప్రతి ఊర్లో ఇలాంటి వారుంటారు.
ఇంట్లోనూ, బడిలోనూ ఉంటున్న పిల్లల్ని దొంగలు ఎత్తుకుపోతున్న రోజులు ఇవి. పిల్లలకు ఏ మాత్రం రక్షణ లేదు. ఒంటరిగా ఇంటినుంచి బయటకు అడుగు పెట్టటం సరదా కాదు. ఆ అనుభవం ఎంత భయానకంగా ఉంటుందో ఈ నవలలో చదవండి.
పిల్లలు మాత్రమే కాదు; అమ్మా నాన్నలూ చదివి తీరాలి.
తెలుగు బాల సాహిత్యంలో నిన్నటి అంకుల్, ఈనాటి తాత అందిస్తున్న తాజా బాలల నవల...

దారి తప్పిన పిల్లవాడు

రచన : పి. చంద్రశేఖర ఆజాద్

వచ్చేవారం నుంచి ప్రారంభం!

పిల్లలూ! మీకు బొమ్మలంటే ఇష్టమే కదా! అయితే ఈ వారం మీకు ఇష్టమైన కుందేలు బొమ్మను ఎలా చేయాలో నేర్చుకుందాం. ఇంట్లో అమ్మా నాన్నలను బయటకు వెళ్లినప్పుడు ఇబ్బంది పెట్టకుండా మీరే ఇంటిలో బొమ్మలు తయారు చేసుకోవచ్చు అయితే, ఇప్పుడు మనం కుందేలును ఎలా చేయాలో దానికి సంబంధించిన వస్తువులు ఏమిటో తెలుసుకుని అవి దగ్గర పెట్టుకుని ఇక్కడున్న విధంగా తయారుచేసుకుందాం.

కావల్సినవి :

దూది : కొంచెం, నీళ్లు : ఒక గిన్నెలో, గూగుల్ ఐస్ : 6, అట్టముక్క : 1, ఫెవిస్టిక్ : 1, చమ్కీలు : 6, స్టోన్స్ : 3 (ఎరుపు రంగువి) మెరుపుల దారం : 1,

తయారీ :

ముందుగా దూదిని కొంచెం కొంచెంగా తీసుకుని గుండ్రంగా చుట్టుకోవాలి. ఇప్పుడు దాన్ని నీళ్లలో ముంచి తీస్తే ఊడిపోకుండా ఉంటుంది. ఇంకా గుండ్రంగా చుట్టుకోవచ్చు. అలా ఆరు తయారు చేసుకుని ఉంచుకోవాలి. ఇప్పుడు మళ్లీ కొంచెం దూదిని తీసుకుని దానిని బారుగా చేసి మడత పెట్టుకోవాలి. చెవుల ఆకారంలో ఇవి కూడా ఆరు చేసుకుని నీళ్లలో తడుపుకోవాలి. ముందుగా మనం గుండ్రంగా చేసి పెట్టుకున్న వాటిని ఒకదానికొకటి అంటించుకోవాలి. తర్వాత చెవులను కూడా అంటించుకుని ఇప్పుడు చెవులకు మధ్యలో చమ్కీలను అంటించుకోవాలి. ఇలా అంటించుకున్న కుందేలుకు కంటి భాగాన గూగుల్ ఐస్‌ని అంటించుకోవాలి. తర్వాత ఎరుపురంగు స్టోన్‌ని నోరులాగా అంటించుకోవాలి. ఇప్పుడు మెరుపుల దారాన్ని పువ్వులాగా చేసుకుని ఫెవిస్టిక్‌తో మెడ దగ్గర అంటించుకోవాలి. ఇలా మూడు తయారుయేసి అట్టముక్కకు అంటించుకోవాలి. అంతే కుందేలు తయారైనట్టే.

తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ రెండు బొమ్మలు చూడడానికి ఒకేలా ఉన్నా, వీటి మధ్య 5 తేడాలు ఉన్నాయి. అవెక్కడున్నాయో గుర్తించి సున్నా చుట్టేయండి.



జత చేయండి

ఈ చిత్రంలో రెండు వరుసల్లో సీతాకోక చిలుకల్ని ఉంచాం! అయితే, వాటిలో ఒకే రకంగా ఉన్న సీతాకోక చిలుకల్ని గుర్తించి జతచేయండి.

సమాజాన్ని తట్టి లేపే 'వేకువపిట్ట'

పుస్తకం : వేకువ పిట్ట
రచన : చల్లపల్లి స్వరూపారాణి
పేజీలు : 119, ధర : 100/-
ప్రతులకు : చల్లపల్లి స్వరూపారాణి
ఫ్లాట్ నెం. 4ఎ, అనుమోలు ఎన్‌క్లేవ్
రామచంద్రనగర్
విజయవాడ : 520002,
సెల్ నెం : 9440362433

చల్లపల్లి స్వరూపరాణి రచయిత్రిగా, కవిగా సుపరిచితమే. ఈమె పేరు వినబడగానే తన మొదటి కవితా సంపుటి 'మంకెన పువ్వు' తటాలున గుర్తుకొస్తుంది. అందులోని 'ఇంట్లో పురుషహంకారం చెంప ఛెళ్లుమనిపిస్తే/ వీధిలో కులాధిపత్యం రెండో చెంప పగలగొడుతుంది' వంటి పంక్తులు ఈ కవయిత్రి లోతుగా దర్శించిన సమాజ పార్శ్వాలను తెలియజేస్తాయి. 'మంకెన పువ్వు' విశ్వవిద్యాలయాల పాఠ్యప్రణాళికల్లో భాగమయ్యి ఈ కవయిత్రి కవిత స్థాయిని ప్రకటించింది. (అస్తిత్వవాద కవిత్వంలో స్పష్టంగా కనిపించాల్సిన జీవితాన్ని, పోటెత్తాల్సిన భావోద్వేగాలను నిక్కచ్చిగా ప్రకటించే కవయిత్రి చల్లపల్లి స్వరూపరాణి.) ఇలాంటి పదునైన కవయిత్రి ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు 'వేకువ పిట్ట'గా కవితా సంపుటిని వెలువరించారు. ఈ కవిత్వం చదివితే సామాన్యులు కూడా తమలోని భావోద్వేగాలకు అక్షర రూపం ఇవ్వాలనుకుంటారనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఎందుకంటే కవయిత్రి ఎంచుకున్న భాష, వస్తువులు అలాంటివి. కవిత నడిపించే తీరులో స్పష్టత, జీవితం నుంచే తీసుకున్న ప్రతీకలు ఈ మాటను బలపరుస్తాయి. "వేకువ పిట్ట"లోని 36 కవితల్లో ఆలోచన, ఆత్మాభిమానం, ఆవేశం, ఆవేదన, ఆకాంక్ష, ఆత్మవిశ్వాసం... ప్రస్ఫుటంగా దర్శనమిస్తాయి. పాఠకుల్ని పలకరించడంతో సరిపెట్టకుండా మళ్లీమళ్లీ కబుర్లాడుకునేటట్లు ప్రభావితం చేస్తాయి. 'అలగా' బతుకుల అంతర్మథనాన్ని ఆవిష్కరిస్తాయి.

ఈ సంపుటిలోని మొదటి కవిత 'వేకువ పిట్ట'లోని మాతృమూర్తి 'పాపులర్' తల్లిని ప్రస్తుతించదు. "వెన్నెట్లో గోరుముద్ద కాదు/ పట్టు పరికిణీల పూలజడ కాదు/ అమ్మంటే వరి నాటు నుంచి/ చీరకొంగున కట్టుకొచ్చిన/ కొబ్బరి ముక్క!". సంపుటిలోని చివరి 36వ కవితలో నాన్నను 'నా ఆకాశం'గా మార్చి "అసలు బడి మొహం చూడని..." నాన్నను 'కేంబ్రిడ్జ్'గా గుర్తించి, "లేనితనాన్ని/ నవ్వుతూ వెక్కిరించడం/ ఎంత గొప్పగా వుంటుందో/ నీలో చదువుకున్నాను" అంటారు కవయిత్రి. ఇక కథువాలో ఉన్మాదానికి బలైన ఆసిఫా గురించి రాసిన "ఈ దేశం పేరు కథువా" కవిత, సామ్రాజ్యవాద అగ్గిలో మాడిపోతున్న సిరియాపై రాసిన "దేశములలో శోభించబడినదానా! సిరియా", ఏ దేశమూ గుర్తించకుండా 'తిరస్కృతుడు'గా మారిన రోహింగ్యా ముస్లీమ్, అలాగే "ఖైర్లాంజి కాష్టం", "లవ్ యెట్ చెన్నై" వంటి కొన్ని కవితలు సమాజంలోని అమానుషమైన పరిస్థితుల్ని తెలియజేస్తాయి. "వధ్యశిల" సాక్షిగా రోహిత్‌ని స్మరిస్తూ "ఇక్కడ ప్రేమ నిషిద్ధం!/ ప్రశ్న నిషిద్ధం!" అంటారు. "వాన"ను తలచుకోగానే "డేగిశాలో బుడుంగు బుడుంగుమంటూ/ అర్ధరాత్రి నిద్రలేపే/ చెమ్మగిల్లిన మా పూరిల్లు గుర్తుకొస్తుంది" అని వానలో అణగారిన వర్గాల జ్ఞాపకాలు గుర్తుచేస్తారు. "ఐ ఫీల్ నేషనలిజం"లో బిడ్డలా పెంచుకునే గేదెతో బంధం, "తల్లికూర"లో "కటిక దరిద్రంలో/ నా జాతి ఆకలి కాసిందీ/ వొంట్లో సత్తువ నింపిందీ/ యీ కూరే బాబయ్యా!... యింత గొడ్డుకూర తింటే/ నిలువునా ప్రాణం తీస్తారా?" అని ప్రశ్నిస్తారు. సంపుటిలోని "యజ్ఞం", "వెలి", "దేశభక్తి", "నీరు", "లోపలి మాట", "మట్టితల్లి", "పరిగపిల్ల" కవితలు దళిత సిద్ధాంతాన్ని సులువుగా నేర్పిస్తాయి. సంపుటిలోనే ప్రత్యేకమైన ఈ కవితలు ఎవ్వరికైనా ఆలోచన రేకెత్తిస్తాయి. 'వేకువ పిట్ట'లోని కవితలన్నీ చదివింపజేస్తాయి, మళ్లీమళ్లీ మననానికి వస్తాయి.

- ప్రవీణ్ వెలుపోలు

సమకాలీన జీవన కథనాలు!

పుస్తకం : బతుకు బంతి
రచన : డా. శాంతి నారాయణ కథలు
పేజీలు : 166, ధర : 150/-
ప్రతులకు : శ్రీమతి ఆర్. విమల, 202, ఎస్.ఎస్. అపార్ట్‌మెంట్స్, మారుతీనగర్, అనంతపురం - 01
సెల్ నెం : 9916671962



ప్రసిద్ధ కథకుడు, నవలా రచయిత, కవి శాంతి నారాయణ. జీవిత వాస్తవికతను, సమకాలీన అంశాలను తన కథల్లో చిత్రించారు రచయిత. ఈ 'బతుకు బంతి' సంకలనంలోని పది కథలూ ఆ కోవకు చెందినవే. టైటిల్ కథ 'బతుకు బంతి' ధనవంతులైన పురుషుల చేతుల్లో ఆటాడే బంతిలా మారిన స్త్రీల జీవితాలను ఆవిష్కరిస్తుంది. కరువు, అప్పులతో చితికిపోయిన గిరిజనరైతు జీవితం, అతడిభార్య, కూతురు అప్పులవాళ్ల చేతుల్లో, కీచకుల చేతుల్లో నలిగిపోయిన వైనాలు మనల్ని కలచివేస్తాయి. ప్రభుత్వమే వాళ్ల జీవితాల విచ్ఛిన్నానికి కారణమని కథను ముగించిన తీరు సమస్య మూలాల్ని తెలియజేయడమే. 'బతుకు బంతి' కథా సంపుటిలోని కథలన్నీ 70 వసంతాలు దాటిన స్వాతంత్ర్య ఫలంలో అమ్మపాలనూ సైతం డబ్బు వ్యాపారంగా మార్చిందనీ, నేరాలనూ, మౌఢ్యాన్ని పెంచి పోషిస్తోందనీ, స్త్రీల జీవితాలను బలి తీసుకుంటోందనీ చాటేవే. శాంతి నారాయణ రాసిన ప్రతీకథా వర్తమాన భారతీయ సామాజిక వ్యవస్థ ముందు ఒక ప్రశ్నను నిలబెడుతుంది. ప్రశ్నించే కథలు రాయడంలో రచయిత సిద్ధహస్తుడని పేరు. గతంలో 'నమ్ముకున్న రాజ్యం', 'పల్లేరుముళ్లు' లాంటి రచనలను తీసుకొచ్చారు. మైల పడుతున్న మనుషులు, తిక్కోని చేతిలో రాయి, ముట్టు గుడిసెలు లాంటి కథలన్నీ పాఠకుడిని ఒక పట్టాన వదలవు. 'ముట్టుగుడిసెలు' కథ స్త్రీలలో నెలసరి సమయంలో జరిగే అమానుష ఆచారాలకు అద్దం పట్టేది. ఎంత దుర్మార్గంగా నేటికీ ఈ పరిస్థితి కొనసాగుతుందో కథాంశంగా తీసుకుని రాయడం అభినందనీయం. 'ఓబయ్య' కథలో లక్ష్మీదేవికి ఇష్టంలేకపోయినా ఆమె తల్లి, తన మేనల్లుడు నరసింహారెడ్డికి బలవంతంగా కట్టబెడుతుంది. అతను కష్టజీవే అయినా, వ్యసనపరుడు. ఆ పరిస్థితుల్లో ఆమె మల్లన్నగౌడ్ ఆకర్షణకు లోనవుతుంది. తప్పంతా ఆమెదేనన్నట్లు భర్త నరికి చంపేస్తాడు. నాగరత్న అనే ఆమె తన భర్త పక్కింటామెతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని, పిల్లల్ని చంపి, తాను చనిపోతుంది. ఓబయ్య భార్య అన్నతో చంద్రన్న చెల్లెలికి సంబంధం ఏర్పడింది. ఈ రెండూ పురుషుని అదనపు ఆనందం కోసమే ఏర్పడ్డాయి. స్త్రీ-పురుష సంబంధాల్లోని వైరుధ్యమూ, అందుకు మూలాలు, వాటి పరిణామాలను చిత్రించడానికి రచయిత సాహసమే చేశారనిపించింది. ఇన్ని పాత్రలతో విభిన్న కథనాలు తీసుకోవడం వల్ల సంక్లిష్టమైన కథనమైంది. 'పదైరు', 'చెప్పల్లనుకుండాను' వంటి పదాలతో రాయలసీమ యాస, భాష, కథలకు గొప్ప సహజత్వాన్ని తెచ్చిపెట్టాయి. రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి రాసిన ముందుమాట సంకలనానికే హైలైట్! కథా రచయితగా 'తనకు తాను వర్తమానీకరించుకున్నాడు' అన్న రాచపాళెం కితాబు అక్షరసత్యాలు.

- శాంతిశ్రీ

ఆకలి శైశవం

ఆ సాగుభూమిలో రక్తపు పువ్వు వెలసి
మాయ ముసుగును మనసుకు తొడిగి
స్వాతంత్రానికై ఈ కుతంత్రపు
సామ్రాజ్యంలోకి
నెత్తుటి ధారలతో సూర్య కిరణంవలె
చొచ్చుకురావాలని
తహతహలాడుతున్నది..!!

ఆ క్షణంలో గుండె మెలిపట్టినట్లు ఉండి
శరీరానికి ఒక పెద్దలోయ ఏర్పడి
నిశబ్దాన్ని ఛేదించి ఆ రక్తపు
గోడల ఇరుసుల నుండి
కొండల నడుమ సూర్యుడు
రాలిపోయినట్లుగా
ధ్వనుల కీకారణ్య లోకంలోకి
ఒక జీవి విసిరేయబడింది..!!

ఆకలికి చచ్చాడుతున్న
ఆ లేత రక్తపు ముద్దకు
ఆమె తన స్తనాలనైతే అందించింది కాని
క్షీరసముద్రాలను నింపుకోవాల్సిన
తన స్తనలలో
సహారా ఎడారికి నివాసం కల్పించడంతో
ఆ జీవి ఉదరంలో ఆకలి విత్తులు
ఏర్పడ్డాయి..!!

దరిద్రాన్ని వారసత్వంగా స్వీకరించడంతో
బీదరికము వృక్షమై ఆకలి
పవనాలను వీస్తుంటే
ఆ పసి మోములో చంద్ర కిరణాలు ఛిద్రమై
భవిష్యత్ భరతం నిర్జీవంగా నేలరాలి
ఒడ్డున పడ్డ చేపపిల్లల గిలగిలలాడుతుంటే..!!

ఈ పైశాచిక తెల్లవస్త్రాల నాగు పాములు
మణిని తమ పడగలపై మోయాలని
చిగురించాల్సిన దేహాలను కోసి
ఆ రుధిర నది దాటి అవతలి ఒడ్డుకు చేరి
నీచ స్వప్న సాధానికి అవినీతి
చక్రవర్తులయ్యారూ..!!

- అభిలాష

07259511956

నాన్న పోరాటం

కాలంతో బాటు
పోరుతూ ఉంటాడు నాన్న
ఆయన సోరాన్నంతా
మనం లాక్కుపోతుంటే,
ఆయన దేహంపై
రాళ్ళు తేలుతుంటాయి!
ఆయనలో ఇంకేం మిగిలిందని
ఇంకా కొంగల్లా ఆ ఎముకలపై వాలడం!

పాయలు పాయలుగా సాగే
జీవిత ప్రవాహంలో
జీవిత గమ్యాన్ని చేరుతున్న దశలో
చివరి పయనం
ఎంత భారమైనా
ఒడ్డున చేరిన మనల్ని చూసి
ఉప్పొంగుతాడు!

ఎంత పలుచనైనా
నాన్న పారుతూనే ఉంటాడు
చివరికి వాయువైపోయినా
పోరాడుతూనే ఉంటాడు
మనకు ఊపిరి నింపుతూ!

అమ్మ ప్రాణాన్నిస్తే
నాన్న జీవితాన్నిస్తాడు!
అమ్మ లోకాన్ని చూపిస్తే
నాన్న ఎలా బతకాలో చూపిస్తాడు!

- పుట్టి గిరిధర్

9491493170

ప్రపంచ పటం

ఏదో ఒక రాయి ప్రతిరోజూ
అతని వీపుని చరుస్తూనే ఉంటుంది
ఆప్యాయతానుబంధాల ఊబిలో
కూరుకుపోయినవాడు
ఆస్తులు అంతస్తులకు లొంగని వాడు
పక్కనున్నవాడు ఆకలితో ఉంటే
చూడలేని వాడు
పక్కటెముకలు వయసు ముడుతల్లో
నలిగిపోతున్నా
ఎప్పుడూ నలుగురి కోసం వెంపర్లాట

నలుగురు కలిస్తేనే సందడంటాడు
నట్టింట్లో నాలుగు విస్తర్లు లేస్తేనే
తాను మనిషిననుకుంటాడు
పలకరింపుతోనే మంచితనాన్ని
కొంటాడు
పసిపిల్లలతో కలిసిపోయి తానూ
పసివాడౌతాడు
ప్రేమలో వాడితో ఎవరైనా పోటీ
పడితే ఓడినట్టే
మరి ...

ఇప్పుడు
నలుగురు మనుషులు కరువై
నాలుగు మెతుకులు దొరక్క
నలుగురి నవ్వుల పువ్వులు రాలక
ఎన్నాళ్లనుంచి మోస్తున్నాడో..
ఒక చేత్తో మనిషితనాన్ని
రెండో చేత్తో గుండె భారాన్ని

ఎన్ని రాళ్లు తగిలాయో ఆ గుండెకు
ముక్కముక్కలుగా ప్రపంచపటం
ఆ ముక్కల్లో చెల్లా చెదురై నువ్వూ
నేను...

- వైష్ణవి శ్రీ

8977237345

ప ద వి కా స ం 123

కూర్పు : రావెళ్ల

ఆధారాలు

అడ్డం

1. మరగుర్రం (4)
3. కుర్రతనం (4)
7. నానబెట్టిన వాటిని రోటిలో వేసి మెదుపు (2)
8. కడిమి చెట్టు (3)
9. ఒక పిల్లల ఛానెల్ (2)
12. గుర్తును సాగదీయండి (3)
13. బాధ (3)
17. జంబూకం (2)
18. విస్మరించు (3)
19. చేపమీది పొట్టు (2)
22. పద్మం (4)
23. అక్షరాలు రాసేవి (4)

1		2		✿	3	4		5
	✿		✿	6	✿		✿	
7		✿	8			✿	9	
	✿	10	✿		✿	11	✿	
✿	12			✿	13			✿
14	✿		✿	15	✿		✿	16
17		✿	18			✿	19	
	✿	20	✿		✿	21	✿	
22				✿	23			

నిలువు

1. మర్మం తెలుసుకొను (4)
2. ఏకమొత్తం ఖరారు (2)
4. నవనీతం తలకిందులైంది (2)
5. పునాది లేకుండా నేలమట్టం నుంచి కట్టిన గోడ (4)
6. దంచడం గజిబిజిగా (3)
10. కీడు (3)
11. ధాన్యాన్ని నిలువ చేసుకునేందుకు తీసే గుంత (3)
14. మానసిక బాధ (4)
15. కారం కోసం వాడే ఒక కాయ (3)
16. అమూల్యమైన (4)
20. నామధేయం (2)
21. చప్పుడు (2)

అఆఇఈ

				9		4		3
		3		1			9	6
2			6	4				7
4			5				6	
		1				8		
	6				1			2
1				7	4			5
8	2			6		7		
7		4		5				

గతవారం జవాబులు

2	5	8	9	6	4	7	3	1
7	4	6	1	5	3	2	9	8
1	9	3	7	8	2	5	6	4
9	3	2	6	4	8	1	7	5
8	1	7	3	9	5	6	4	2
4	6	5	2	1	7	9	8	3
3	2	1	4	7	9	8	5	6
6	8	9	5	3	1	4	2	7
5	7	4	8	2	6	3	1	9

1 కా	ర	2 కు	డు	✿	3 ఎ	4 దు	ర్	5 త
ర్య	✿	ప్ప	✿	6 ఆ	✿	త్త	✿	ల
7 భా	గ్యం	✿	8 కా	ర	కం	✿	9 ము	పా
రం	✿	10 ఆ	✿	డి	✿	11 వ	✿	గ
✿	12 వా	క	ఋ	✿	13 ప	ల్లు	దు	✿
14 కా	✿	సం	✿	15 ప	✿	రం	✿	16 క
17 లం	చం	✿	18 అ	ల్లి	క	✿	19 సు	ల
చే	✿	20 ఆ	✿	క	✿	21 ఎ	✿	కా
22 యు	21 వ	రా	ణి	✿	23 ఎం	దా	కా	లం

గోంగూర పచ్చడి

కావల్సినవి :

గోంగూర : 2 కట్టలు, పచ్చిమిర్చి : 20, వెల్లుల్లి రెబ్బలు : 2, ఉల్లిపాయలు 1, ధనియాలు : 1/2 కప్పు, శెనగపప్పు : 1స్పూను, నూనె : 2స్పూన్లు, ఉప్పు : రుచికి సరిపడా

తయారీ :

ముందుగా ఒక ఫ్రైయింగ్ పాన్‌లో గోంగూర ఆకులు, పచ్చిమిర్చి, వేసి కొద్దిగా నీళ్ళు చిలకరించి 10-15నిముషాలు సిమ్‌లో పెట్టి ఉడికించుకోవాలి. ఇప్పుడు ఉడికించుకొన్న పచ్చిమిర్చి వెల్లుల్లి, ధనియాలు, జీలకర కొద్దిగా ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. అవసరం అయితే కొద్దిగా నీళ్ళు మిక్స్ చేసుకోవచ్చు. తర్వాత అందులో గోంగూర ఆకులు కూడా వేసి మరో రెండు నిముషాలు గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత పాన్‌లో కొద్దిగా నూనె వేసి వేడయ్యాక అందులో జీలకర, శెనగపపప్పు, కరివేపాకు, వేసి వేగిన తర్వాత ఉల్లిపాయ ముక్కల, వెల్లుల్లి రెబ్బలు వేసి మరో రెండు మూడు నిముషాలు మీడియం మంట మీద వేగించుకొని మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఉల్లిపాయ ముక్కలు మెత్తగా వేగిన తర్వాత గ్రైండ్ చేసి పెట్టుకొని గోంగూర మిశ్రమాన్ని వేసి బాగా మిక్స్ చేసి వెంటనే స్టౌ ఆఫ్ చేయాలి. అంతే ఆంధ్రా స్టైల్ గోంగూర పచ్చడి రెడీ. ఇది రైస్ సాంబార్‌కు సైడ్ డిష్‌గా బెస్ట్ కాంబినేషన్. అలాగే ముద్దపప్పు, రైస్‌కు కూడా బెస్ట్ కాంబినేషన్ .

లోకల్ రుచులు

ఆకుకూర పప్పు

కావల్సినవి :

కందిపప్పు - 1కప్పు, పాలకూర : రెండు కట్టలు, చుక్కకూర : ఒక కట్ట, పచ్చిమిర్చి : 8, ఉల్లిపాయ : 1, టమోటా : 2, పసుపు : 1/2 స్పూను, ఉప్పు : రుచికి తగినంత, పోపు కోసం : వెల్లుల్లి రెబ్బలు : 6, ఎండుమిర్చి : 2, కరివేపాకు : 2 రెమ్మలు, జీలకర్ర : 1 స్పూను, ఆవాలు : 1స్పూను, ఇంగువ : చిటికెడు, నెయ్యి : 2 స్పూన్లు

తయారీ :

ముందుగా ఆకుకూరలు రెండూ బాగా కడిగి సన్నగా తరగాలి. తర్వాత పప్పుని కుక్కర్లో వేసి అందులో ఆకుకూరముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, టమోటా ముక్కలు, పసుపు వేసి బాగా ఉడకనివ్వాలి. ఉడికిన ఆకుకూర పప్పు లో ఉప్పు వేసి కొద్దిగా నీరు పోసి బాగా కలపాలి. తరువాత మరొక పాన్ పెట్టి అందులో నెయ్యి వేసి ఒక నిమిషం తరువాత వెల్లుల్లి రేకులు, కరివేపాకు, ఎండుమిర్చి, జీలకర, ఆవాలు వేసి బాగా వేగనివ్వాలి. చివరగా ఇంగువ కూడా వేసి వేగనిచ్చి, పప్పులో వేసి ఐదు నిమిషాలు మూత పెట్టాలి. అంతే మంచి రుచిగా ఉండే ఆకుకూర పప్పు రెడీ.

గోంగూర మాంసం

కావల్సినవి :

చికెన్ : 1 కేజీ, గోంగూర : 100గ్రా, ఉల్లిపాయలు 2, పుదీనా : కొద్దిగా, ఎండుమిర్చి : 10, నీళ్లు : 1గ్లాసు, కారం : 1స్పూను, ఉప్పు : రుచికి సరిపడా, అల్లం వెల్లుల్లి పేస్ట్ : 1 స్పూను, మసాలా పొడి : 1స్పూను, పసుపు : 1/2 స్పూను, ఆయిల్ : సరిపడా, కొత్తిమీర : కొద్దిగా, నీళ్ళు : చికెన్ ఉడికించుకోడానికి సరిపడా

తయారీ :

మిక్సీలో ఎండుమిర్చి, కొత్తిమీరను వేసి మెత్తగా పేస్ట్ చేసుకుని పక్కన పెట్టుకోవాలి. తర్వాత ప్రెజర్ కుక్కర్‌లో శుభ్రం చేసి పెట్టుకొన్న చికెన్ ముక్కలు వేసి, చికెన్ ఉడకడానికి సరిపడా నీళ్ళు పోయాలి. అందులోనే కారం, పసుపు, ఉప్పు, అల్లం వెల్లుల్లిపేస్ట్ వేసి బాగా మిక్స్ చేసి మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించుకోవాలి. చికెన్ ఉడికిన తర్వాత పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మరో పాన్ తీసుకొని అందులో కొద్దిగా నూనె వేసి వేడి చేసి అందులో ఉల్లిపాయ ముక్కలు, పసుపు, కొద్దిగా అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి వేగించుకోవాలి. పోపు, ఉల్లిపాయ ముక్కలు వేగిన తర్వాత అందులో గోంగూర ఆకులు వేసి ఫ్రై చేసుకోవాలి. తర్వాత మొదట పేస్ట్ చేసిపెట్టుకొన్న ఎండుమిర్చి కొత్తిమీర పేస్ట్‌ను అందులో వేసి ఫ్రై చేయాలి. ఈ మిశ్రమం మాడిపోకుండా ఇప్పుడు కొద్దిగా నీళ్ళు పోసి ఫ్రై చేసుకోవాలి. ఇప్పుడు ఉడికించుకొన్న చికెన్ వేయాలి. చికెన్ తో పాటు, ఉప్పు కూడా వేసి కలుపుకోవాలి. తక్కువ మంట మీద ఉడికించుకోవాలి. అంతే గోంగూర చికెన్ రెడీ...

సో. క్యూ

గిలగిలలాడే ప్రాణం

'హ్యారీ' యానిమేషన్ షార్ట్‌ఫిల్మ్... ర్యాట్ రేస్ జీవనశైలిలో విలవిల్లాడిపోతున్న సామాన్యుడిని ఓ ఊహా పాత్రలో చూపిస్తుందీ చిత్రం. మెకానికల్‌గా కొట్టుకుపోతున్న జీవితం నుంచి తెరిపించి తనలో ఇంకా మిగుల్చుకున్న పసివాడని అనుభూతిని తిరిగి దక్కించుకునే ప్రయత్నంలో ఉండే 'హ్యారీ'కి అది సాధ్యమైందో లేదో చిత్రాన్ని చూసే తెలుసుకోవాలి. అడుగడుగునా మన వాస్తవ జీవితానికి చెందిన ఎన్నో ప్రతీకల్ని ఈ కథలో చూడొచ్చు. చిన్నారుల ఊహాలు చాలా గమ్మత్తుగా ఉంటాయి. ఆకాశంలో విహరించే చేపల్ని వాళ్లు ఊహించొచ్చు. అప్పుడా అనుభూతే వేరు. ఈ అనుభూతిని ప్రధానం చేసుకుని కథ నడిపించాడు హోహోరాన్ జౌ. ఏడాదిపాటు ఒక్కడే శ్రమించి సృజించిన ఈ చిత్రం నిడివి ఏడు నిమిషాలు. ఓ జీవిత పాఠాన్నీ దీని ద్వారా నేర్చుకోవచ్చు. మీ పసిమనసు, బాల్యస్మృతుల కోసం గిలగిలలాడే ప్రాణాన్ని సింబాలిక్‌గా ఇందులో చూసుకోండి.

'నైట్‌షిఫ్ట్'... తెలుగు లఘుచిత్రం. ఏ ఉద్యోగం దొరక్క కాల్‌సెంటర్లో పని వెతుక్కునే వాళ్లెంతోమంది. ఇక నైట్‌షిఫ్ట్ పనైతే వారి కష్టాలకు కొదవుండదు. చదివిన చదువొకటి, చేసే పని మరోటి, నిద్రపోయే వేళొకటి... అంతా గజిబిజీ గజిబీ జీవితాన్ని కళ్లకు కట్టే ఈ చిత్రంలోని టైటిల్ సాంగ్ కూడా చక్కగా సరిపోతుంది. రోబోటిక్ లైఫ్‌లో నే బానిసనే... అని సాగే ఆ పాటలోనే చిత్రం కథంతా వినిపిస్తుంది. హాస్యాన్ని మిళితం చేసి చిత్రీకరించిన ఈ చిత్రంలో నటుల నటన సహజంగా కనిపిస్తుంది. ఇద్దరూ వేర్వేరు వేళల్లో పనిచేసే భార్యాభర్తల జీవితం ఎలా ఉంటుందో..? నైట్‌షిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన భర్త నిద్ర కష్టాలెలా ఉంటాయో.. సరదాగా చూపించినా వారి సమస్య గురించి తప్పకుండా ఆలోచించాలనే సంగతి చెబుతుంది. కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, సంగీతాన్ని శ్రీతేజ జీడిగుంట అందిస్తే.. మోహన్ వంశీ ఎడిటింగ్, దర్శకత్వం వహించారు. అనిరుధ్ శాండిల్య లిరిక్స్ బాగున్నాయి. రష్మీ మిశ్రా, సుహా చంద్రమౌళి నిర్మాతలు. విపణ్య మీడియా అందించిన ఈ లఘుచిత్రం నిడివి 22 నిమిషాలు.

వేళకాని వేళ

అమ్యూజిక్



రహ్మాన్ హమ్స్

రహ్మాన్ ఇంటర్ల్యూడ్స్, హమ్మింగ్స్... సినిమాలో సంగీతమంటే కేవలం పాటలేనా..? నేపథ్య సంగీతానికీ పెద్ద పీట వేస్తున్నారు ఈ మధ్య. అలాగే, మధ్యమధ్యలో వచ్చే హమ్మింగ్స్, ఇంటర్ల్యూడ్స్‌నీ ఈలపాటతోనో, హమ్‌తోనో పని మధ్యలో, ప్రయాణంలో, పుస్తకం చదువుతూనే చేస్తుండటం సంగీతాభిమానులు. ఇక వారికి ఏఆర్ రహ్మాన్ ఇంటర్ల్యూడ్స్, హమ్మింగ్‌లంటే ఎంత ప్రాణమో చెప్పక్కరల్లేదు. వాటిని రింగ్‌టోన్లుగా పెట్టుకుని మురిసిపోయేవారుంటారు. వీడియోఆల్బమ్‌లకు వాడి సంతోషపడేవాళ్లూ ఎక్కువే. కానీ, వీటన్నింటినీ హాయిగా వినేందుకు ఇప్పుడు యూట్యూబ్‌లో ప్రత్యేకమైన ఆడియో దొరుకుతోంది. రహ్మాన్ ఇంటర్ల్యూడ్సే కాదు, వివిధ సినిమాలకు స్వరపర్చిన బీజీఎం కూడా ఉంటోంది. ఇంకేంటి ట్యూన్ ఇన్ అవ్వండి.

ట్యూబ్‌లైట్

సుచిత్రం

ఇండియాకు అమృత...



'యూరప్... పికాసో, మాటిస్సె, బ్రేక్‌లది. ఇండియా నాకు మాత్రమే చెందినది.' చిత్రకళలో ఓ యువ సంచలనం మాట. భారత చిత్రకళలో ఆధునిక శైలికి ఆద్యురాలిగా కొలిచే అమృతా షేర్గిల్ జీవితాన్ని ఒడిసిపట్టేందుకు ఓ కేన్వాస్ చాలదు. అయినా, ఆమె అంతరంగాన్ని చూడాలంటే... లోతైన ఆలోచనలో మునిగిపోయిన సెల్ఫ్‌పొట్రెయిట్‌ని, చిల్లాక్స్‌గా కనిపించే స్వీయచిత్రాన్నీ కలిపిచూడాలి. ఆమె స్వేచ్ఛాపిపాసను అర్థం చేసుకోవాలంటే సెల్ఫ్‌న్యూడ్స్‌లోని ప్రతీకల్ని ఉన్నతంగా చూడగలగాలి. భారత్ గ్రామీణులు, స్త్రీల బతుకు దృశ్యాన్ని ఆమె చిత్రాలే స్వాతంత్ర్య పోరాట సమయంలో ప్రపంచానికి చూపించాయి. ఇప్పటికీ చాలామంది ప్రముఖ చిత్రకారులు అమృతను అనుకరిస్తున్నారు.. అనుసరిస్తున్నారు. 16 ఏళ్లకే తాను నాస్తికురాలని తెగువతో చెబితే కాన్వెంట్ నుంచి బయటకు పంపేశారు. దగ్గరి బంధాల అంతర్మథనాల్లో చిక్కుకున్న ఆమె జీవించిన కాలం 28 ఏళ్లే. అంతుచిక్కని సమస్యతో ప్రదర్శనకు ముందు స్పృహ కోల్పోయి కోమాలోకి చేరి మరణించింది. ఆమె మరణంపై ఎన్నో వివాదాలున్నాయి. ఆమె జీవితమూ అప్పటి సమాజ మనస్తత్వానికి వివాదాస్పదంగానే కనిపించింది. అయినా, యునెస్కో 2013లో ఆమె 100వ జయంతి సందర్భంగా అంతర్జాతీయ సంవత్సరాన్ని ప్రకటించింది. ఆమెను ప్రతీకగా తీసుకుని ప్రఖ్యాత రచయితల పాత్రలు ప్రాణం పోసుకున్నాయి. బాలీవుడ్ చిత్రాల కథలూ కూరాయి. బుడాపెస్ట్ సాంస్కృతిక కేంద్రానికి ఆమె పేరే. ప్రఖ్యాత చిత్రకారిణి ఫ్రీదా కల్హోతో ఆమె పోల్చినా.. ప్రపంచానికి, ఇండియాకి అమృత ఒక్కటే.













రెక్కల కొండ

అమెరికా ఆదివాసీలైన ప్యూబ్లో ప్రజల కేంద్రమైన షిప్‌రాక్ భూమ్మీదున్న వింతైన ప్రాంతాల్లో ఒకటి. సుమారు 18 కి.మీ.ల వరకు ఎడారి మధ్యన గోడ కట్టినట్టు నిలిచి ఉంటాయీ అగ్నిశిలలు. రెక్కలకొండగా స్థానిక నవాజో తెగలు పిలుస్తున్న కొండ ఎత్తు ఏడు వేల అడుగుల పైనే ఉంటుంది. దాన్నుంచి సాగే గోడబారు శిలల సగటు ఎత్తు పదిహేను వందల అడుగులు. భూమి లోపలకు మరో మూడు వేల అడుగుల లోతుకు కొండ భాగం ఉంటుందని ఓ అంచనా. ఇదంతా మూడు కోట్ల ఏళ్లనాడు తయారైన అగ్నిపర్వత శిలావిన్యాసం. ఈ చోటులానే ఆశ్చర్యపరిచే స్థానికుల అనసాజీ సంస్కృతి ఇక్కడ వెల్లివిరిసింది.